ప్రజాశక్తి

మంగళవారం 13 మే 2025

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

వేడి నుంచి చల్లగా నగరం

◆ ఉదయం భానుడి ప్రతాపం.. సాయంత్రం వరణుడి పలకరింపు ◆ విశాఖలో విభిన్న వాతావరణం ◆ నేడు నైరుతి ఆగమనం ◆ రేపు అండమాన్‌లో ఉపరితల ఆవర్తనంతో వర్షాలు

ఉదయం ఎండ వేడిమికి నిర్మానుష్యంగా కనిపిస్తున్న ఓ కూడలి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ నగరంలో సోమవారం విభిన్న వాతావరణం కనిపించింది. పగలంతా ఎండ దంచికొట్టగా.. సాయంత్రం చిరుజల్లులు పలకరించాయి. చల్లని గాలులు వీచాయి. అయితే ఎండలు పూర్తిగా తగ్గుముఖం పట్టలేదని ఎపి విపత్తుల నిర్వహణా సంస్థ సోమవారం రాత్రి వెల్లడించింది. రాష్ట్రంలో పలు చోట్ల మంగళవారం ఎండ తీవ్రత ఉండే అవకాశాలున్నాయని వెల్లడించింది. సోమవారం విశాఖలో సుమారు 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సాయంత్రం మాత్రం కూర్మన్నపాలెం, గాజువాక ప్రాంతంలో మోస్తరు వర్షం కురిసింది. నగరంలో చాలా చోట్ల చిరుజల్లులు పడ్డాయి.

పగలంతా ఉక్కపోతతో నగరం లోని పలు ప్రాంతాల ప్రజానీకం అల్లాడిపోయారు. వేడి గాల్పులు మంగళవారం ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఉండే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. మంగళవారం అండమాన్ సముద్రం, దక్షిణ బంగాళాఖాతం, నికోబార్ దీవుల్లోని కొన్ని ప్రాంతాల్లోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించనుండటంతో కొంత మేరకు చల్లని వాతావరణంలోకి వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీనికి తోడు దక్షిణ అండమాన్ సముద్ర తీరాన్ని ఆనుకుని ఉన్న ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం వల్ల బుధవారం వర్షాలు కురిసే అవకాశముంది. నైరుతి గాలులు విశాఖ సహా ఎపి అంతటా వీయనున్నాయి. వర్షాలు కూడా అడపాదడపా మిగతా 2లో..

సాయంత్రం జోరువానలోనే సాగుతున్న ప్రయాణాలు

ఎయు రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థులు

అర్ధాంతరంగా హాస్టళ్లను ఖాళీ చేయిస్తారా ?

ఎయు విద్యార్థుల ధర్నా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : తమను అర్ధాంతరంగా హాస్టళ్లను ఖాళీ చేయాలనడం తగదంటూ ఆంధ్ర యూనివర్సిటీ విద్యార్థులు సోమవారం వర్సిటీ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ధర్నారు దిగారు. వారినుద్దేశించి ఎస్‌ఎఫ్‌ఐ ఎయు నాయకులు వెంకటరమణ మాట్లాడుతూ హాస్టళ్ల ఖాళీ చేయాలని ఈ నెల 6న ఆంధ్ర యూనివర్సిటీ రిజిస్ట్రార్ విడుదల చేసిన సర్క్యులర్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని, సెలవుల్లోనూ విద్యార్థులు హాస్టళ్లలో ఉండి చదువుకునేందుకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎయు యాజమాన్యం నెట్, సెట్, డిఎస్‌సి, కానిస్టేబుల్, ఇతర కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌కు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులకు ప్రతి సంవత్సరం అకామిడేషన్ కల్పిస్తోందని, ఈ ఏడాదీ కొనసాగించాలని కోరారు. యూనివర్సిటీలో చదువుతున్న విద్యార్థులు బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారని, బయట అద్దెలు చెల్లించుకుని చదువులు సాగించలేరని అన్నారు. తాము పదేపదే విజ్ఞప్తులు చేసినా వర్సిటీ యాజమాన్యం స్పందించకపోవడం దారుణమన్నారు. నీటి సమస్య ఉండటం వల్లే హాస్టళ్లను ఖాళీ చేయిస్తున్నామని కుంటిసాకులు చెప్పడం తగదన్నారు. ప్రతి హాస్టల్ దగ్గర దాదాపు రెండు గంటలసేపు నీరు వస్తోందన్నారు. ఇప్పటికైనా వర్సిటీ అధికారులు తీరు మార్చుకోవాలన్నారు.

అన్ని ప్రాంతాలనూ అభివృద్ధి చేయాలి

▶ వార్త 2లో..

సందడిగా మోదకొండమ్మ ఉత్సవం

▶ వార్త 8లో..

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటాం

▶ వార్త 2లో..

అనకాపల్లిలో జరిగిన ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నబ్బాయి

ఉపాధ్యాయుల సమస్యలపై యుటిఎఫ్ ధర్నా

వార్త 4లో..

పిజిఆర్‌ఎస్‌కు వినతుల వెల్లువ

◆ కలెక్టరేట్‌కు 208, జివిఎంసికి 88 అర్జీలు ◆ ఉదయం నుంచే బారులు తీరిన ప్రజలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ విలేకరులు

విశాఖ కలెక్టరేట్, జివిఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్‌ఎస్)కు వినతులు వెల్లువెత్తాయి. ఉదయం 9 గంటల నుంచే అర్జీదారులు బారులుతీరి కనిపించారు. ఎండ తీవ్రత ఎక్కువుగా ఉన్నా తమ కష్టాలను అధికార యంత్రానికి చెప్పుకునేందుకు వారంతా అర్జీలతో వచ్చారు. విశాఖ కలెక్టరేట్‌కు ప్రజల నుంచి వివిధ సమస్యలపై మొత్తం 208 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ శాఖకు చెందినవి 80, పోలీసు శాఖకు సంబంధించి 19, జివిఎంసికి సంబంధించి 52, అలాగే ఇతర విభాగాలకు సంబంధించి 57 వినతులు ఉన్నాయి. పిజిఆర్‌ఎస్‌కు వచ్చిన అర్జీలను 24 గంటలలోపు ఓపెన్ చేసి పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, పునరావృతంకాని విధంగా

వినతులు స్వీకరిస్తున్న విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్

చూడాలని విశాఖ కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సంతృప్తికరమైన, నాణ్యమైన పరిష్కారం చూపాలని అన్నారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన అర్జీదారుల సమస్యలను వింటూ, అర్జీలను స్వీకరిస్తూ, సంబంధిత అధికారులకు ఎండార్స్ చేసి శాశ్వత పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ల్యాండ్ సర్వే, రెవెన్యూ శాఖ, జివిఎంసిలకు సంబంధించి మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

వేడి నుంచి చల్లగా నగరం

పడతాయని విశాఖపట్నం, అమరావతి వాతావరణ కేంద్రాలు సోమవారం రాత్రి వెల్లడించాయి. రాగల మూడు రోజుల వరకూ బలమైన ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు ఉత్తరాంధ్రలో కొన్ని చోట్ల కురిసే అవకాశాలున్నాయని తెలిపాయి. ఇక సోమవారం నాటి వాతావరణ పరిస్థితికి వస్తే రాష్ట్రంలో జంగమేశ్వరపురంలో అత్యధికంగా 42.2 డిగ్రీల ఉష్ణోగ్రత, అమరావతిలో 41.3, ఒంగోలులో 41.3, నందిగాం, గన్నవరంలలో 41, విశాఖలో 38 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ ప్రాంతాల్లో జనం ఉక్కపోత, వేడిమితో ఇబ్బందులు పడ్డారు.

పిజిఆర్ఎస్‌కు వినతుల వెల్లువ

ఎక్కువగా అర్జీలు వస్తున్నాయని తెలిపారు. వాటి పరిష్కారంపై దృష్టి పెట్టాలన్నారు. అర్జీ పునరావృతమైతే జిల్లా అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. జిల్లాలో రీ ఓపెన్ అర్జీలు తరచుగా రావడం పట్ల అధికారులపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల నుంచి జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, జివిఎంసి అడిషనల్ కమిషనర్ ఎస్ఎస్ వర్మ వినతులు స్వీకరించారు.

జివిఎంసి ప్రధాన కార్యాలయంలో..

జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని పాత సమావేశ మందిరంలో నిర్వహించిన పిజిఆర్ఎస్‌కు 88 వినతులు వచ్చాయని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. జివిఎంసి అదనపు కమిషనర్ డివి.రమణమూర్తితో కలసి ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటాం

ప్రజాశక్తి - ఉక్కునగరం : రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను పోరాటాలతో కాపాడుకుంటామని స్టీల్‌ప్లాంట్ ఒబిసి అసోసియేషన్ అధ్యక్షులు బి.అప్పారావు స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 1551 రోజులకు చేరుకున్నాయి. దీక్షల్లో ఒబిసి అసోసియేషన్ నాయకలు, ఉక్కు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ కార్మికోద్యమాలను అపహాస్యం చేస్తే సహించేది లేదని అన్నారు. రానున్న కాలంలో ఉక్కు పోరాటాన్ని మరింత ఉధృతం చేయనున్నామని తెలిపారు. దశాబ్దాలుగా విశాఖ అభివృద్ధికి స్టీల్‌ప్లాంట్ ఎంతగా దోహదపడిందో మరిచిపోతే ఎలా ? అని ప్రశ్నించారు. ప్లాంట్ ప్రైవేటీకరణ అయితే కార్మికులకు, ఉక్కు నిర్వాసితులకు, కర్మాగారంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి బతుకుతున్న వారందరికీ ఇబ్బందులు ఎదురుకానున్నాయన్నారు. ఇప్పటికైనా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని కోరారు.

నేడు జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అధ్యక్షతన మంగళవారం జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించనున్నట్టు జిల్లాపరిషత్ సిఈవో పి. నారాయణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్‌పి చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన వి.సి.హాలులో, జెడ్‌పి సమావేశ మందిరంలో స్థాయీ సంఘ సమావేశాలు వేర్వేరుగా ఉదయం 10 గంటల నుంచి 12 వరకు జరుగుతాయన్నారు. 2, 5వ స్థాయీ సంఘ సమావేశాలు ఉదయం 10 గంటలకు, 3, 4 వ స్థాయీ సంఘ సమావేశాలు 11 గంటలకు, 1,6,7 వ స్థాయీ సంఘ సమావేశాలు ఉదయం 12 గంటలకు జరుగుతాయని వివరించారు.ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, ఎంపిపిలు,సంబంధించిన ప్రగతి నివేదికతో అధికారులు సమావేశాలకు హాజరుకావాలని కోరారు.

జివిఎంసి ప్రత్యేక సమావేశం మినిట్స్ ఇవ్వండి

ప్రజాశక్తి- విశాఖకలెక్టరేట్: ఏప్రిల్ 19న జరిగిన జివిఎంసి ప్రత్యేక సమావేశం ప్రక్రియల మినిట్స్ ప్రతిని ఇవ్వాలని, జివిఎంసి ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్‌హరేంధిరప్రసాద్‌ను వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్, వైసిపి ఆఫీస్ ఇన్‌చార్జి రవిరెడ్డి ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు అందించిన వినతిపత్రంలో కోరారు. ఏప్రిల్ 19 న నిర్వహించిన సమావేశంలో గొలగాని హరి వెంకటకుమారి (జివిఎంసి మేయర్) పై అవిశ్వాస తీర్మాన సమావేశం సందర్భంగా వైసిపి నియమిత పార్టీ విప్‌గా తాము కోరిన పై పత్రాలను వీలైనంత త్వరగా అందజేయాల్సిందిగా కోరారు. తమ ఫిర్యాదులపై తగు చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు.

బస్సులను కండిషన్‌లో ఉంచాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉన్నందున బస్సులన్నింటినీ కండిషన్‌లో ఉంచాలని విశాఖ జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఆయన మద్దిలపాలెం సిటీ డిపోని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్స్, సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ రద్దీకి అనుకూలంగా బస్సులు తిప్పాలన్నారు.

విశాఖపట్నం, పాడేరుకు సుమారు 20 బస్సులు తిరుగుతున్నాయని, మోదకొండమ్మ అమ్మవారి జాతరకు స్పెషల్ బస్సులు తిరుగుతున్నాయని ప్రయాణికులకు ఉపయోగపడేలా మరింత సౌకర్యాలు అందించాలన్నారు. ఈ నెల 18 నుంచి 22 వరకు సాలూరులో జరిగే శ్యామలాంబ అమ్మవారి జాతరకు కూడా సుమారు 100 బస్సులు నడపాలన్నారు. ప్రయాణికులను ఆకర్షించుకునే విధంగా సర్వీసులు చేసి బస్సులన్నీ కండిషన్ లో ఉంచాలన్నారు. మద్దిలపాలెం డిపోలో ఆదర్శ ఉద్యోగులకు అవార్డును ప్రధానం చేశారు. కార్యక్రమానికి మద్దిలపాలెం డిపో మేనేజర్ అరుణ కుమారి, అసిస్టెంట్ ఇంజనీర్ బిందు, అసిస్టెంట్ మేనేజర్ మాధురి, స్టేషన్ మేనేజర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అన్ని ప్రాంతాలనూ అభివృద్ధి చేయాలి

మాట్లాడుతున్న జెవి.సత్యనారాయణ మూర్తి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అమరావతినే అభివృద్ధి చేస్తూ మిగతా ప్రాంతాలను విస్మరిస్తోందని, ఇది మంచిది కాదని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి తప్పుపట్టారు. విశాఖ అల్లిపురంలోని సిపిఐ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమరావతి కోసం ఇప్పటికే 40 వేల ఎకరాలు సేకరించారని, మరో 40 వేల ఎకరాలు సేకరిస్తున్నారని, అమరావతిలో ప్రభుత్వం చేస్తున్న భూ కేటాయింపులకు అర్థం లేదని విమర్శించారు. అమరావతికి గన్నవరం 30 కిలోమీటర్ల దూరంలో ఉందని, గన్నవరం విమానాశ్రయాన్ని అభివృద్ధి చేస్తుండగా అమరావతిలో మరో అంతర్జాతీయ విమానాశ్రయానికి 4 వేల ఎకరాలు కేటాయించడాన్ని తప్పుపట్టారు. అమరావతిలో రైల్వేస్టేషన్ కోసం 2,600 ఎకరాలు కేటాయించారని, దేశంలో ఏ రైల్వేస్టేషన్ చూసినా వంద ఎకరాలలోపే ఉన్నాయని తెలిపారు. విశాఖ కేంద్రంగా ఐటీని అభివద్ధి చేస్తామని చెప్పి అమరావతిలో ఐకానిక్ టవర్లను నిర్మిస్తున్నారన్నారు. జగన్ వల్ల విశాఖ ఐటీ అభివద్ధికి తీవ్ర నష్టం జరిగిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విశాఖలో టిసిఎస్ ఏర్పాటుకు ఒప్పందం కుదిరి,ఎకరం 99 పైసలకు భూములను కేటాయించారని, టిసిఎస్ ఎప్పుడు కార్యకలా పాలు ప్రారంభిస్తుందో తెలియదన్నారు. విశాఖలో ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ సంస్థకు భూములు కేటాయించారని, అక్కడ మౌలిక సదుపాయాలు కోసం భారీగా నిధులు ఖర్చు చేశారని, ఇప్పటివరకూ ఆ సంస్థ పునాదిరాయి కూడా వేయలేదని విమర్శించారు.2026లో భోగాపురం విమానాశ్రయం కార్యకలాపాలు ప్రారంభమవుతాయని విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు ప్రకటించారని, విమానాశ్రయాన్ని అనుసంధానం చేస్తూ రహదారులను ఇప్పటి వరకు అభివృద్ధి చేయలేదని అన్నారు.

విశాఖ మెట్రో కారిడార్‌పై కేంద్రం నుంచి ఇప్పటి వరకు స్పష్టమైన ప్రకటన లేదన్నారు. తెలుగుదేశం హయాంలో నిర్మించిన టిడ్కో గహాలను లబ్ధిదారులకు అప్పగించాలని, టిడ్కో గహాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అడ్డుకునేందుకు కూటమి ప్రభుత్వం ఎటువంటి ప్రయత్నాలు చేయడం లేదన్నారు.

సిపిఐ జిల్లా కార్యదర్శిగా రెహమాన్

సిపిఐ విశాఖ జిల్లా 25వ మహాసభలలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా ఎస్.కె. రెహమాన్, జిల్లా సహాయ కార్యదర్శులుగా కె.సత్యనారాయణ, పి.చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులుగా ఎం.పైడిరాజు, కె.సత్యాంజనేయ, ఆర్.శ్రీనివాసరావు, ఎం.మన్మధరావు, సి.ఎన్. క్షేత్రపాల్ రెడ్డి, కె.వనజాక్షి, ఎన్.నాగభూషణంలతో పాటు మొత్తం 33 మందితో నూతన సమితిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ వివరాలను సత్యనారాయణ మూర్తి వెల్లడించారు.

కెసిఎస్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

మాట్లాడుతున్న వై.రాజు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పోర్టు ప్రాంతంలో గోడలకు రంగులు, బొమ్మలు వేసిన కళాకారుల కష్టార్జితం ఎగ్గొట్టడానికి కుట్ర చేయడమే కాకుండా, కళాకారులను గుండాల చేత బెదిరింపుల గురి చేసిన కె.సి.ఎస్ కనస్ట్రక్షన్స్ యాజమాన్యంపై చర్య తీసుకోవాలని కెవిపిఎస్ విశాఖ జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు డిమాండ్ చేశారు. సోమవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పది మంది ఆర్టిస్టులు కెసిఎస్ కన్‌స్ట్రక్షన్ యాజమాన్యం వద్ద సుమారు ఏడాది పాటు కష్టపడి పనులు చేశారన్నారు. పోర్టు యాజమాన్యం కాంట్రాక్టర్ నుంచి కళాకారులకు రావాల్సిన నగదు ఇప్పించాలని డిమాండ్ చేశారు. పనులు పూర్తయి 4 నెలలు గడిచినా ఇవ్వాల్సిన నగదు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. మొత్తం లేబర్ చార్జి రూ.18 లక్షలు అయిందని, అడ్వాన్స్ పోగా రూ.11 లక్షల 7 వేలు కాంట్రాక్టర్ ఎగ్గొటాలని కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై పోర్టు అధికారులకు ఫిర్యాదు చేశామని, ఫిర్యాదు చేసి 3 వారాలు గడిచినప్పటికీ, ఇంతవరకూ చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఇప్పటికైనా వారికి రావాల్సిన మొత్తం నగదు చెల్లించకుంటే బాధితులతో సీహార్స్ జంక్షన్‌లో పెద్దఎత్తున ఆందోళన నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్.సూరిబాబు, సిహెచ్‌రాజు పాల్గొన్నారు.

మేయర్‌కు సత్కారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగర మేయర్‌గా ఎన్నికైన పీలా శ్రీనివాసరావును జివిఎంసి జనసేన ఫ్లోర్‌లీడర్ బీశెట్టి వసంతలక్ష్మి ఆధ్వర్యంలో జనసేన కార్పొరేటర్లందరూ జివిఎంసి ప్రధాన కార్యాలయంలో ఆయన ఛాంబర్‌లో సోమవారం కలిసి ఆయనను సన్మానించారు. నగరపాలక సంస్థలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా పూర్తి చేసి విశాఖ నగరాన్ని అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అందరి సహకారం కావాలని కోరారు.

జివిఎంసి కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

కాంట్రాక్టర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి కాంట్రాక్టర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. కొన్ని నెలలుగా అసోసియేషన్ ఎన్నికపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా పివివి.నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా ఎం.సంజీవరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మద్దాల రమేష్, ఉపాధ్యక్షులుగా గుర్రం సింహాచలం, బర్ల రామానాయుడు, ట్రెజరర్‌గా సిరికి శ్రీనివాసరావు, జాయింట్ ట్రెజరర్‌గా మధుపాడ రవికుమార్, జాయింట్ సెక్రటరీలుగా బూటు కృష్ణ, కె.అప్పలనాయుడు, మెంబర్లుగా కోటేశ్వరరావు, కంచర్ల శ్రీను, కె.రామలింగేశ్వరరావు, అల్లు సూర్యనారాయణ, అల్లు బంగారు నాయుడు, నేమాల రమేష్, చిట్టి గణపతి ఎన్నికయ్యారు.

జనరల్ నోటీసు

మహారాజశ్రీ అనకాపల్లి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

S.O.P. No. 5/2025

బిట్వీన్: 1.శ్రీమతి యలమంచిలి దుర్గాభవాని
2.శ్రీమతి యలమంచిలి వెంకట పద్మప్రియాంక
3.శ్రీ యలమంచిలి కార్తికేయ నాయుడు
. . . పిటీషనర్స్

అండ్: నిల్ . . . రెస్పాండెంట్స్

ఇండియన్ సెక్సేషన్ యాక్టు సెక్షన్ 372 ప్రకారం

పై నెంబరు పిటిషన్‌లో 1వ పిటిషనరు యొక్క భర్తయున్నూ మరియు 2,3 పిటిషనర్సు యొక్క తండ్రియున్నూ అయిన శ్రీ యలమంచిలి లక్ష్మణరావుగారు, సామర్లకోట రైల్వేస్టేషన్, క్యాటరింగ్ సర్వీసెస్ ఫ్లాట్‌ఫారం స్టాల్-1ను నిర్వహిస్తూ తే 08-02-2025దిన మరణించియున్నారు. సదరు రైల్వే అధారిటీ / డిపార్టుమెంటు వారు సదరు స్టాలు కొనసాగించుకొనుటకు మరణించిన ఆసామీ తరపు వారసులుగా నిర్ణయిస్తూ సక్సేషన్ సర్టిఫికేట్ దాఖలు చేయమని అదేశించి యున్నారు. అంతట సదరు సక్సేషన్ సర్టిఫికేట్టు యిప్పించ గోరి పిటిషనర్సు పై నెంబరు పిటిషన్‌ను కోర్టులో దాఖలు చేసియున్నారు.

కావున, అందును గురించి ఎవరికైనను ఎటువంటి ఆక్షేపణలు వున్న ఎడల అట్టి వారు **ది. 24-6-2025న ఉదయం 10-30లకు** స్వయంగా పై కోర్టులో హాజరై తమ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో శ్రీకోర్టు వారు ప్రస్తుతం వున్న పిటిషనర్ల, వాదనలు పరిశీలించి తగు విధముగా పరిష్కరించడమగునని ఇందుమూలంగా తెలియచేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వులు మేరకు)

సుంకర శ్రీనివాసరావు ఎమ్.ఎ., ఎమ్.ఎ., బి.ఎల్.
అడ్వకేటు & నోటరీ
వైజయంతి అపార్టుమెంట్, ఉడ్‌పేట,
అనకాపల్లి. సెల్: 98486 14189

ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

ప్రజాశక్తి - యంత్రాంగం

ఆరిలోవ : ఆరిలోవ ఎఫ్ఆర్‌యులో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనిత ఆధ్వర్యాన డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ రాగసుధ పర్యవేక్షణలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం హాస్పిటల్ స్టాఫ్ నర్సులు ప్రమీల, ఉమా, సుమతో కేక్ కట్ చేయించి డాక్టర్ రాగసుధ, డాక్టర్ వెంకటేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనిత మాట్లాడుతూ, నర్సింగ్ వృత్తి మహోన్నతమైనదన్నారు. డాక్టర్లు రాగసుధ, వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, నైటింగేల్‌ను ఆదర్శంగా తీసుకొని నర్సులు రోగులకు సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎంలు శ్రీదేవి, విజయకుమారి, బేబీ కుమారి, చిట్టి, సిబ్బంది పాల్గొన్నారు.

గీతంలో ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతి

మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ నర్సింగ్ ఆధ్వర్యాన సోమవారం ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతి, అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్సర్) ప్రోవైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి, తూర్పు నౌకాదళం వైద్య విభాగం ఐఎన్ఎస్.కల్యాణి డిప్యూటీ ప్రిన్సిపల్ లెఫ్టినెంట్ కల్నల్ జెస్సీ ఐజాక్, జిమ్సర్ వైద్య కళాశాల డీన్ డాక్టర్ ఎస్‌పి.రావు హాజరయ్యారు. ఈ ఏడాది అంతర్జాతీయ నర్సింగ్ దినోత్సవ నినాదం 'మన నర్సింగ్ నిపుణులు-భవిష్యత్తు - ఆర్థిక బలం' అనే అంశంపై వారు ప్రసంగించారు. అంకిత భావంతో నర్సింగ్ వృత్తిలో సేవలందించాలని, వత్తి నైపుణ్యాలతో పాటు విలువలు పాటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేషన్‌బాలు, నిర్వాహక కార్యదర్శులు డాక్టర్ సిహెచ్ లావణ్య, ఎస్‌వివిఎల్.పద్మకుమారి తదితరులు పాల్గొన్నారు. నర్సింగ్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలతో పాటు నర్సింగ్ వృత్తిపై రీల్‌మేకింగ్ పోటీ నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. కార్యక్రమంలో నర్సింగ్ అధ్యాపకులు, నర్సింగ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌లో ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతిని పురస్కరించుకుని నర్సుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద, డిసిఎస్ ఆర్ఎంఒ డాక్టర్ మెహర్ కుమార్, గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్ సిహెచ్.పద్మావతి, గ్రేడ్ 2 అధికారి కల్పనామాళి, సుగీత స్వర్ణలతతో పాటు అసోసియేషన్ అధ్యక్షురాలు టి.గంగాభవాని, కార్యదర్శి జివిఎస్.వరలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్న సీనియర్ హెడ్ నర్స్ మద్దిరాల ఇందిరకు పాడేరు గవర్నమెంట్ ఆసుపత్రి గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా ఉద్యోగోన్నతి లభించిన నేపథ్యంలో సన్మానించారు.

కెజిహెచ్‌లో ఇందిరను సత్కరిస్తున్న సూపరింటెండెంట్ శివానంద తదితరులు

విజెఎఫ్‌లో..

నర్సుల దినోత్సవం సందర్భంగా విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ్ ఆధ్వర్యంలో పలువురు నర్సులను సత్కరించారు. ప్రజాప్రతినిధులు కన్నా నర్సులు తమ ప్రాణాలను, కుటుంబాన్ని ఫణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్నారని రామ్ అన్నారు. వారి పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. జనసేన కార్పొరేటర్ కందుల నాగరాజు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మత్తు పదార్థాలు విక్రయిస్తున్న ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి -గాజువాక : మత్తు పదార్థాలు విక్రయిస్తున్న ఇద్దరు యువకులను గాజువాక పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. దీనికి సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... చింతలపూడి లావణ్య వెంకట సత్యకుమార్ (26), కొండపల్లి తరుణ్ (24) బెంగళూరు నుంచి 2.4 గ్రాముల మత్తు పదార్థాలను తీసుకొచ్చి గాజువాక ఆటోనగర్ వద్ద విక్రయిస్తున్నారు. టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడిచేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న మత్తు పదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను గాజువాక పోలీసులకు అప్పగించారు. గాజువాక పోలీసులు వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

తాగు నీరు వృథా

వృథాగా పోతున్న తాగు నీరు

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస జెడ్‌పి హైస్కూల్‌కు వెళ్లే దారిలో తాగు నీరు వృథాగా పోతోంది. జివిఎంసి ఆధ్వర్యాన ఇటీవలనే రోడ్డును తవ్వి దాదాపు 40 ఏళ్ల క్రితం నాటి 200 ఎంఎం పురాతన పైపులైన్ స్థానంలో జివిఎంసి ప్రాజెక్ట్ నిధుల నుంచి 200 ఎంఎం, హెచ్‌డిపిఇ పైపు లైన్‌ను పునరుద్ధరించారు. ఈ క్రమంలో పైపులైన్ వేశాక ప్రొక్లెయినర్‌తో మట్టిని పూడ్చే సమయంలో కొన్ని ఇళ్లకు సంబంధించి ఇంటి కుళాయి పైపు లైన్లు దెబ్బతిన్నట్టు స్థానికులు సోమవారం తెలిపారు. దీంతో రోడ్డుపై తాగు నీరు వధాగా పోతుందని, రోడ్డంతా బురదమయం కావడంతో అటుగా వెళ్లి వచ్చే వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని స్థానికులు వాపోతున్నారు. వృథాగా పోతున్న తాగు నీటిని కొందరు తాత్కాలిక పైపు అమర్చి బకెట్లలో పట్టుకుంటున్నారు. తాగు నీరు వృథాగా పోకుండా సంబంధిత అధికారులు తక్షణమే జోక్యం చేసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో వార్డు ఫుట్‌బాల్‌గ్రౌండ్‌లో ఉన్న వార్డు సచివాలయంలో అడ్మిన్‌తో పాటు కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించాలని జోనల్ కమిషనర్ బమ్మి అయ్యప్పనాయుడుకు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో టిడిపి వార్డు నాయకులు వినతి పత్రం అందజేశారు. సుమారు 5 నెలలుగా అడ్మిన్‌తో పాటు కంప్యూటర్ ఆపరేటర్ లేనందున సచివాలయానికి వివిధ అవసరాల కోసం వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో టిడిపి నాయకులు గరే చంద్రమౌళి, నరవ రామారావు, తాటిపూడి అప్పలరాజు, బి.గోవింద్, గరే సదానంద ఉన్నారు.

ఘనంగా ప్రభాత్‌రంజన్ సర్కార్ జయంతి

ప్రజాశక్తి - ఆరిలోవ : పాత డైరీ ఫారం సమీపంలోని ఇందిరానగర్‌లో ఉన్న ఆనంద మార్గ ఆశ్రమంలో సంస్థ వ్యవస్థాపకులు ప్రభాతరంజన్ సర్కార్ (బాబా) జయంతిని సోమవారం వైభవంగా నిర్వహించారు. విశాఖ జిల్లాలో ఉన్న ఆనంద మార్గ సభ్యులు ఉదయం 5 గంటలకు పాంచ జన్య ధ్యానం జరిపి అఖండ కీర్తన, సామూహిక ధ్యానం జరిపారు. అనంతరం ప్రభాతరంజన్ సర్కార్ జీవితంపై రూపొందించిన చిత్రాన్ని తెరపై ప్రదర్శించారు. వివిధ భాషల్లో రాసిన ఆనందవాణిని ఆనంద మార్గ సభ్యులు చదివి వినిపించారు. ఆనంద మార్గ చిల్డ్రన్ హోమ్ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఆచార్య సౌమ్యానంద అవధూత, త్రిలోకేసానందావధూత, సభ్యులు స్టీల్‌ప్లాంట్ డిజిఎం (రిటైర్డ్) ఎన్.వంద, ఆర్‌వి పాత్రో, న్యాయవాది ఎన్‌వివిఎన్.రాజు, వైఎవిఎన్.రాజు, వైఎస్ఎస్.రాజు, వైవిఎన్.రాజు చలం పాల్గొన్నారు.

59వ వార్డులో సురేష్ పర్యటన

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 59వ వార్డు పరిధి చైతన్యనగర్‌లో జనసేన నాయకులు పుర్రె సురేష్ యాదవ్ స్థానిక కమిటీ సభ్యులు, గ్రామస్తులతో సోమవారం కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను స్థానికులు సురేష్ యాదవ్ దృష్టికి తీసుకొచ్చారు. చాలా చోట్ల స్తంభాలకు వీధి దీపాలు లేకపోవడం, కొన్నిచోట్ల సరిగా వెలగకపోవడం వంటి సమస్యలను స్థానికులు తీసుకురావడంతో సురేష్‌యాదవ్ స్పందించి జివిఎంసి ఎలక్ట్రికల్ ఎఈతో మాట్లాడారు. ఈ సమస్యను మూడు రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు గండి అప్పారావు, కార్యదర్శి పరశురాం, రాజారావు, జనసేన నాయకులు పాపినాయుడు, కోలా రాము, గుండు మోహన్ పాల్గొన్నారు.

ఆంగ్లంపై పట్టు సాధించాలి

ప్రజాశక్తి -తగరపువలస : ఆంగ్లంపై పట్టు సాధించాలని ఉపాధ్యాయులు గంటాన మోహనరావు విద్యార్థులకు సూచించారు. భీమిలి మండలం మూలకుద్దులో గత కొద్ది రోజులుగా ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యాన వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం సొసైటీ కరస్పాండెంట్, ఉపాధ్యాయులు గంటాన మోహనరావు ఆంగ్లంలో మెలుకువలపై బోధించారు. అతను రాసిన "స్పీక్ ఇంగ్లీష్ యాజ్ ఇంగ్లీష్" పుస్తకంలోని అనేక అంశాలను వివరించారు. ఆంగ్లంలో మాట్లాడడం, రాయడంలో మెలుకువలు, ఉచ్ఛరణ, దస్తూరి, వ్యాకరణ లోపాలు ఎలా సరి చేయాలి అంశాలను బోధించారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ విద్యార్థులు ఆంగ్లంలో వంద మార్కులు ఎలా సాధించ వచ్చునేది వివరించారు.

న్యాయ సహాయకుల నియామకానికి దరఖాస్తులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : న్యాయ సహాయకులుగా పనిచేసేందుకు ఆసక్తి గల వారినుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల న్యాయ సేవాధికార సంఘం అధ్యక్షులు, స్థానిక ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి డి.సౌజన్య సోమవారం తెలిపారు. ప్రజలకు న్యాయ పరమైన సలహాలతో పాటు తగిన న్యాయ సహాయం చేయాలన్న ఆలోచన కలిగిన ఔత్సాహికుల నుంచి ఈ నెల 16వ తేదీ లోపు స్థానిక కోర్టులో ఉన్న మండల న్యాయ సేవాధికార సంఘం కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు. టెన్త్ పూర్తి చేసిన ఆసక్తి గల యువతీ యువకులు ఆధార్ కార్డు, విద్యార్హత జెరాక్స్ కాపీలు, ఒక పాస్‌పోర్టు సైజ్ ఫోటో, స్టాంప్ సైజ్ ఫోటోను దరఖాస్తుతో పాటు జత చేసి అందజేయాలని తెలిపారు. టెన్త్ విద్యార్హతతో పాటుగా వివిధ సేవా సంస్థల్లో పని చేసిన వారికి నియామకాల్లో ప్రాధాన్యత ఉంటుందని వివరించారు. న్యాయ సహాయకులుగా ఎంపికైన వారికి జీతం, పారితోషికం ఉండవని తెలిపారు. శిక్షణ తరగతుల అనంతరం ఏడాది కాలానికి పారా లీగల్ వాలంటీర్లుగా నియమించనున్నట్లు తెలిపారు.

రహదారి పనులు పూర్తిచేయాలి

జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-మధురవాడ : ఆక్రమణలో ఉన్న రహదారి స్థలాన్ని స్వాధీనం చేసుకొని, సగంలో ఆగిపోయిన సిసి రోడ్డు నిర్మాణ పనులను వెంటనే పూర్తిచేయాలని సిఐటియు మధురవాడ జోన్ ఉపాధ్యక్షులు డి.అప్పలరాజు డిమాండ్ చేశారు. సోమవారం జోనల్ 2 కార్యాలయంలో స్థానికులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మికి, ఎసిపి తిరుమలరావుకు వినతిపత్రాలు అందజేశారు. గతంలో మున్సిపల్ కమిషనర్లు రాజబాబు, సంపత్ కుమార్ రహదారి స్థలాన్ని పరిశీలించి వెంటనే ఆక్రమణలు తొలగించి సిసి రోడ్డు నిర్మాణం చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని వివరించారు. తహశీల్దార్, జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, జోనల్ కమిషనర్‌కు అనేక వినతి పత్రాలు ఇచ్చి వివరించామని తెలిపారు. రహదారి నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారని, అధికారులు, సిబ్బంది వచ్చి చూసి వెళ్తున్నారు తప్ప పనిచేయడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. రోడ్డు పనులు పూర్తికాక స్వయంకృషి నగర్, అయ్యప్పనగర్ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో కనీసం ద్విచక్ర వాహనాలు కూడా రాని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సదరు ఆక్రమణదారులపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆక్రమణలో ఉన్న రహదారి స్థలానికి ప్రభుత్వం నుంచి పట్టాలు ఇవ్వడం గానీ, రిజిస్ట్రేషన్ గానీ చేయకుండా జాగ్రతలు తీసుకోవాలని కోరారు. సిసి రహదారి నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. వినతి పత్రం అందచేసిన వారిలో బి.సంతోషిలక్ష్మి, టికె.శారద తదితరులు పాల్గొన్నారు.

కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని వినతి

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 97వ వార్డు చినముసిడివాడ రెవెన్యూ పరిధి బర్నన్ నగర్ కాలనీలో గత 14 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ మేయర్ పీలా శ్రీనివాసరావుకు సిపిఐ నాయకులు సోమవారం వినతిపత్రం అందించారు. 2011 సంవత్సరం నుంచి కాలనీవాసులు జివిఎంసికి ఇంటి పన్నులు చెల్లిస్తున్నారని, అయినా ఆ కాలనీకి కనీస వసతులైన రోడ్లు, తాగునీరు, విద్యుత్తు సరఫరా, అంగన్‌వాడీ కేంద్రం వంటివి లేవని ఆవేదన వెలిబుచ్చారు. నగరం నడిబొడ్డున కారు చీకట్లో వందలాది కుటుంబాలు నివాసముంటున్నాయని, వారంతా కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మేయర్ శ్రీనివాసరావు బర్నన్ నగర్ కాలనీకి మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. పెందుర్తి ప్రాంతానికి చెందిన వ్యక్తి మేయర్ కావడంతో బర్నన్ నగర్ కాలనీ సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశిస్తున్నట్లు సిపిఐ పెందుర్తి ఏరియా సమితి అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరావు, సమితి సభ్యుడు వై.రాంబాబు, పెందుర్తి శాఖ కార్యదర్శి అసిరినాయుడు, కాలనీవాసులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.అన్నపూర్ణ, కాలనీ వాసులు అనురాధ, సింహాలమ్మ, ఉమా, సుశీల, కె.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని వేములవలస బిపి.కల్లాలు రోడ్డును ఆనుకుని ఉన్న పంచాయతీ లే-అవుట్‌లో 40 అడుగుల రోడ్డును ఆక్రమించి 30 అడుగుల ఏర్పాటుకు పనులు చేపడుతున్నారని గ్రామానికి చెందిన వార్డు మెంబర్ కోరాడ దామోదరరావు, గ్రామస్తులు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. 40 అడుగుల రోడ్డు ఉండాల్సిన చోట రోడ్డుపైకి నిర్మాణాలు చేపట్టి 30 అడుగులు మాత్రమే ఉండడంతో వారిపై చర్యలు తీసుకోకుండా రోడ్డు పనులకు ఏర్పాటు చేస్తున్నారని, దీనిపై విచారణ జరిపి పూర్తిస్థాయిలో రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. కంది రవికుమార్, చింతపల్లి అప్పలనాయుడు, కొట్టాడ బాబూరావు, పుట్ట సంతోష్ తదితరులు రోడ్డుపైకి ఆక్రమణలు చేపట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

వార్డు సమస్యలపై మేయర్‌కు వినతి

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డులోని సమస్యలపై మేయర్ పీలా శ్రీనివాసరావుకు వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ సోమవారం వినతిపత్రం అందించారు. వార్డులోని సమస్యలను వివరించారు.

జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాంబాబు తదితరులు

ప్రజా సమస్యలపై వినతి

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక జోన్ ప్రజా సమస్యలపై సిపిఎం ఆధ్వర్యాన గ్రీవెన్స్‌లో సోమవారం జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. గాజువాక జోన్ పరిధిలో ప్రధానంగా మంచినీటి సమస్య, కుక్కలు, పందుల సమస్య, వీధి దీపాలు, టిడ్కో ఇళ్ల సమస్యలను వివరించారు. 65వ వార్డు పరిధి బాపూజీ కాలనీలో తాగునీరు లేక చాలా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రతిరోజూ పావుగంటే కుళాయిలు ఇస్తున్నారని, సమయం పెంచాలని కోరారు. 69వ వార్డు పరిధి షీలానగర్‌లో కుక్కల సమస్య తీవ్రంగా ఉందని, 68, 69, 70, 72 వార్డుల్లో వీధిలైట్లు వెలగట్లేదని, రాత్రిపూట పిల్లలు, వృద్ధులు ప్రమాదాలకు గురవుతున్నారని వివరించారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో సిపిఎం జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, జోన్ కమిటీ నాయకులు ఎల్.బంగారంనాయుడు, కెపి.కుమార్, ఎస్.గణేష్, కెవి.రమణ, ఎం.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చీరలు పంపిణీ చేస్తున్న నాయకులు

చీరల పంపిణీ

ప్రజాశక్తి -గాజువాక : హైకోర్టు న్యాయవాది అండి బోయిన లక్ష్మి, స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి అప్పారావు వివాహ వార్షికోత్సవ సందర్భంగా పేద మహిళలకు సోమవారం చీరలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా జిల్లా మాజీ జడ్జి బొక్క సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య హాజరై లక్ష్మి, అప్పారావు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ దంపతులు పేదలకు సేవలందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. కార్పొరేషన్ డైరెక్టర్‌గా లక్ష్మి పనిచేసిన కాలంలో ఎంతోమంది కళ్ల గీత కార్మికులకు సహాయ సహకారాలు అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ సంజీవరావు, ఎజిఎం నమ్మి తాతారావు, అండిబోయిన అప్పారావు, సీనియర్ మేనేజర్ మల్లుల సూర్యనారాయణ, వెంకటేశ్వరరావు, కార్మిక నాయకులు డివి.రమణ, జనసేన నాయకులు గంధం వెంకట్రావు, గరసాల అప్పారావు, ఆళ్ల నాగరాజు, వెంపాడ అప్పారావు, గొలుసు సత్యం, మారేడుపూడి పరదేశి, నక్క వెంకటరమణ పాల్గొన్నారు.

వెంకటరావు దంపతులను సన్మానిస్తున్న రామ్మోహనరావు

వావిలపల్లి వెంకటరావుకు సన్మానం

ప్రజాశక్తి- మాధవధార : రైల్వేలో ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన వావిలపల్లి వెంకటరావు దంపతులను ఈస్ట్ కోస్ట్ రైల్వే డివిజనల్ కో-ఆర్డినేటర్ పప్పల రామ్మోహనరావు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైల్వేలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే మాధవధార గ్రామాభివృద్ధికి ఎంతో కృషిచేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాధవధార రైల్వే కార్మిక సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు పప్పల రామచంద్రరావు, రైల్వే యూనియన్ నాయకులు పప్పల శ్రీహరి, మూల అప్పారావు, కర్రి రమేష్, నంబాల జగదీష్, రైల్వే కార్మిక నాయకులు, రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై యుటిఎఫ్ ధర్నా

విశాఖపట్నం డిఇఓ కార్యాలయం వద్ద ధర్నాలో కూర్చున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - యంత్రాంగం

ఆరిలోవ : పాఠశాలల పునర్వ్యవస్థీకరణ, బదిలీలు, ఉపాధ్యాయుల ప్రమోషన్లకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యాన సోమవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున నినదించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్.అంబేద్కర్ మాట్లాడుతూ, పాఠశాల విద్యాశాఖ చేపడుతున్న పాఠశాల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియతో పాటు స్పష్టమైన జిఒలు లేకుండా రోజుకో ఆలోచనతో జరుగుతున్న ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. సమస్యలపై ఉపాధ్యాయుల ఆందోళనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పరిష్కారం లభించలేదన్నారు. బదిలీలు, ప్రమోషన్లు, పునర్వ్యవస్థీకరణకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేకుంటే ఈ నెల 15వ తేదీన విద్యాభవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, యుటిఎఫ్ జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శులు టి.అప్పారావు, వైఆర్‌కె.ప్రసాద్, జిల్లా గౌరవాధ్యక్షులు అనకాపల్లి పైడిరాజు, సహాయ అధ్యక్షులు ఆర్.ఉమాదేవి, రాంబాబు, రిజ్వాన్, టి.జగన్, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.నూకరాజు, రాంబాబు, జనార్దన్, శ్రీను, సంతోష్, అప్పలరాము, శోభా, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : పాఠశాలల పునర్వ్యవస్థీకరణలో లోపాలను సవరించాలని కోరుతూ సోమవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో అనకాపల్లి డీఈఓ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. కార్యాలయ సూపరింటెండెంట్లు కే.రామలింగేశ్వరరావు, జి.పార్వతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ అధికారులు పూటకో మాటతో రోజుకొక నిబంధనతో రాష్ట్ర విద్యా వ్యవస్థను గందరగోళంలోకి నెట్టేస్తున్నారని విమర్శించారు. టీచర్ల ట్రాన్స్‌ఫర్లు, ప్రమోషన్లను ప్రశ్నార్థకం చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం ఆరు రకాల పాఠశాలలుగా విభజిస్తే, ప్రస్తుత ప్రభుత్వం వాటిని తొమ్మిది రకాల పాఠశాలలుగా విభజించి ప్రజలను గందరగోళ పరిస్థితుల్లోకి నెట్టివేస్తుందని విమర్శించారు. రాష్ట్ర ఉన్నతాధికారులు జీవో 117ను రద్దు చేస్తామని ఏడాది నుండి చెబుతున్నా, ఇప్పటికీ రద్దు చేయలేదన్నారు. హైస్కూల్స్‌లో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి 1:40గా, ప్రాథమిక పాఠశాలలో 1:20గా ఉండాలన్నారు. సమస్యలపై ఈ నెల 15న రాష్ట్రస్థాయి ధర్నా విజయవాడలో చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు పంపనబోయిన వెంకట్రావ్, రొంగళి అక్కునాయుడు, జోగా రాజేష్, గుత్తుల సూర్య ప్రకాష్, మాకిరెడ్డి రాజునాయుడు, ఎంవి.అప్పారావు, ఎల్లయ్యబాబు, మామిడి బాబూరావు, దేవుడు నాయుడు, బండారు శంకర్, మూర్తి, జగన్, తేజ్ వర్ధన్, ఆశ, నీరజ పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే పల్లా జన్మదిన వేడుకలు

గాజువాక నియోజకవర్గంలో కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- యంత్రాంగం

గాజువాక : గాజువాకలో పలుచోట్ల ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. నియోజవర్గంలోని అన్ని వార్డుల్లోనూ ఆయా వార్డు కార్పొరేటర్లు, వార్డు టిడిపి అధ్యక్షులు ఆధ్వర్యాన దుస్తుల పంపిణీ, అన్న సమారాధన తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమాలకు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఎక్కడా హాజరు కాలేదు. ఆయన తండ్రి పల్లా సింహాచలం అనారోగ్యం కారణంగా జన్మదిన కార్యక్రమానికి దూరంగా ఉన్నారని స్థానిక నాయకులు తెలిపారు.

అనకాపల్లి రూరల్ : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు అనకాపల్లి పార్లమెంట్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీతో కలిసి నాగజగదీష్ కేక్ కటింగ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బొలిశెట్టి శ్రీనివాసరావు, కోట్ని రామకృష్ణ, బోడి వెంకటరావు, కాయల మురళి పాల్గొన్నారు.

రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ ఆదేశాల మేరకు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపాటు. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, నాయకులు బిఎస్ఎంకె జోగి నాయుడు, బొలిశెట్టి శ్రీనివాసరావు, పోలారపు త్రినాథ్

చోడవరం : చోడవరం టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసే శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గూనూరు మల్లు నాయుడు, బొడ్డే నాగ గంగాధర్, వెంకట అప్పారావు, సకురు కోటేశ్వరరావు, మాజీ జడ్పిటిసి మత్స్య రాజు పాల్గొన్నారు.

అచ్చుతాపురం : అచ్చుతాపురం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాజాన రమేష్ కుమార్, ధూళి రంగనాయకులు, ఆడారి మంజు, జె నర్సింగరావు, లాలం రాము, పాల్గొన్నారు.

సంప్రదాయేతర ఇంధనంతో విద్యుత్ వాహన అనుసంధానం

గీతం వర్సిటీ ఎఫ్‌డిపిలో నిపుణులు



గీతం వర్సిటీ ఎఫ్‌డిపిలో పాల్గొన్న నిపుణులు

ప్రజాశక్తి-మధురవాడ : సంప్రదాయేతర ఇంధన వనరులైన సౌర, పవన విద్యుత్తును కృత్రిమ మేధ సహకారంతో విద్యుత్ వాహనాలకు అనుసంధానం చేయడంపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యాన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం (ఎఫ్‌డిపి) సోమవారం నిర్వహించారు. ఐఐటి జోధ్‌పూర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నిశాంత్‌కుమార్, ఐఐటి భువనేశ్వర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎన్‌కె.స్వామినాయుడు, అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ మిస్సోరీ కాన్సాస్ పరిశోధకుడు డాక్టర్ జి.ప్రీతం, రాధానుటెక్నాలజీస్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎల్ఎన్.శాస్త్రి రిసోర్స్ పర్సన్‌లుగా హాజరై అధ్యాపకులకు దిశానిర్దేశం చేశారు. సంప్రదాయేతర విధానాలలో ఉత్పత్తి అయ్యే విద్యుత్తు శక్తిని కృత్రిమ మేధ సహాయంతో స్మార్ట్ గ్రిడ్‌లకు కలుపుతూ తద్వారా అవసరమైన విధంగా విద్యుత్తు వాహనాలను ఏవిధంగా రీఛార్జి చేయవచ్చో వివరించారు. సౌరశక్తితో నడిచే విద్యుత్తు వాహనాలు, స్మార్ట్ ఛార్జింగ్, బ్యాటరీల సామర్థ్యంతో పాటు భవిష్యత్తులో పెరగనున్న విద్యుత్తు వాహనాల సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలియజేశారు. ఈ రంగంలో పరిశోధనలకు గల అవకాశాలను అధ్యాపకులు అధ్యయనం చేయాలని సూచించారు. విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున అధ్యాపకులు ఈ ఎఫ్‌డిపి కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమానికి కన్వీనర్లుగా డాక్టర్ యు.సల్మా, డాక్టర్ ఐఇఎస్.నాయుడు, డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు వ్యవహరించారు.

బార్లు, వైన్ షాపులు, హోటళ్లకు నోటీసులు

ప్రజాశక్తి-పెందుర్తి : పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని కొన్ని బార్లు, వైన్ షాపులు, హోటళ్లలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం, ఆహార సరఫరా చేస్తున్నట్లు గుర్తించిన పోలీసులు ఆయా సంస్థల యజమానులకు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా సిఐ కెవి సతీష్ కుమార్ మాట్లాడుతూ, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంజూరు చేసిన లైసెన్స్ నిబంధనల ప్రకారం మద్యం షాపులలో ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు, బార్లలో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు మద్యం విక్రయాలు, ఆహార సరఫరా రాత్రి 12 గంటల వరకు మాత్రమే జరపాలని తెలిపారు. ఈ సమయాల తరువాత నిర్వహించే కార్యకలాపాలు నిబంధనల ఉల్లంఘనగా పరిగణించి కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల భద్రత కోసం యాజమాన్యాలు ప్రవేశ ద్వారాలు, కౌంటర్, పార్కింగ్ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, స్పష్టమైన బోర్డులతో ఎగ్జిట్ మార్గాలు అందుబాటులో ఉంచాలని, ఫైర్ అలారం పనిచేసే స్థితిలో ఉండాలని, అవసరమైన మందులతో కూడిన ఫస్ట్ ఎయిడ్ బాక్స్ సిద్ధంగా ఉంచాలని, ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని యజమానులకు సూచించారు. లైసెన్స్, ఫైర్ ధ్రువీకరణ పత్రం, మునిసిపల్ సర్టిఫికెట్లు స్పష్టంగా ప్రదర్శించాలని, అక్రమంగా మద్యం విక్రయించరాదని, అధిక శబ్దం, డీజే వాడకాన్ని నియంత్రించాలని, అనుమానాస్పద కార్యకలాపాలను వెంటనే పోలీసులకు తెలియజేయాలని చెప్పారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-సీతమ్మధార : ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు సుమారు రూ.2,51,419ను లబ్ధిదారులకు ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు సోమవారం స్థానిక బిజెపి కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలో ఎవరు అనారోగ్యం పాలైనా హాస్పిటల్‌కు సంబంధించిన ఒరిజినల్ బిల్స్ పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సురేష్ బాబు, కూటమి నాయకులు గొర్లె అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

పలు ప్రాంతాల్లో విస్తృత ప్రచారం, పోస్టర్ల ఆవిష్కరణ

రాంబిల్లిలో కార్మికులతో కలిసి బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం

కేంద్ర కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈ నెల 20న జరుగు దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో సోమవారం విస్తృతంగా ప్రచారం జరిగింది. బ్రిటిష్ కాలం నుండి కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, యాజమాన్యాలకు అనుకూలంగా ఉండే విధంగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరుతూ, కార్మిక, కర్షక, ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఈ సమ్మె జరుగుతోందని, కార్మిక, కర్షక వర్గాలు, ప్రజలు పాల్గొని ఈ సమ్మెను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

పరవాడ : దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తుందని ఆటో, మోటర్, బస్, లారీ, వ్యాన్లు వంటి రవాణా కార్మికుల సమస్యలపై ఈ నెల 20న జరుగు సమ్మెల డ్రైవర్లు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ మేరకు సమ్మె పోస్టర్‌ను సోమవారం లంకెలపాలెం జంక్షన్‌లో ఆటో యూనియన్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు.

కె.కోటపాడులో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఖాతా వెంకటస్వామి, ఈ నర్సింగరావు, విరోధి ఠాగూర్, మధు, నర్సింగరావు రమణ శ్రీను పాల్గొన్నారు.

రాంబిల్లి : రాంబిల్లి మండలంలో సిఐటియు నాయకులు దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కరపత్రాలు, బుక్‌లెట్స్‌తో ప్రచారం చేశారు. స్కీం వర్కర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం 26,000 అమలు చేయాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.దేముడునాయుడు, నాయకులు ధోని కాసియా, సుజాత, సావిత్రి, మంగ, రమ్య, పలువురు స్కీం వర్కర్లు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట : స్కీం వర్కర్లు, అసంఘటిత రంగం కార్మికులు, పంచాయతీ వర్కర్ల సమస్యలు పరిష్కారం కోసం ఈ నెల 20న జరుగు దేశ వ్యాప్త సమ్మెపై స్థానిక ఎంపీడీఓ విజయలక్ష్మికి సోమవారం సిఐటియు నాయకులు సమ్మె నోటీసు అందించారు. కార్యక్రమంలో సిఐటియు నేతలు ఎస్‌వి నాయుడు, రాజాబాబు సింహాద్రి, శ్రీను, ముత్యాలు, యేసురాజు, లోవ పాల్గొన్నారు.

చోడవరం : ఈ నెల 20న జరుగు సమ్మె వాల్ పోస్టర్‌ను చోడవరంలో సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి గూనూరు వరలక్ష్మి మాట్లాడుతూ స్కీమ్ వర్కర్లు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అసంఘటిత కార్మికులకు సమగ్రమైన చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్కీమ్ వర్కర్స్ సంఘాల నేతలు కె.వరలక్ష్మి, బి.రామలక్ష్మి బుద్ధన లక్ష్మి, కాంతం, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాయుడు పాల్గొన్నారు

కె.కోటపాడు : స్థానిక సిఐటియు కార్యాలయంలో సోమవారం మే 20న జరుగు దేశవ్యాప్త సమ్మె పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో సిఐటియు, రైతు సంఘాల నాయకులు ఈ.నాయుడుబాబు, జి.నాయనబాబు, ఎర్రదేముడు, రొంగలి ముత్యాల నాయుడు, వనము సూర్యనారాయణ స్కీమ్ వర్కర్ల నేతలు జి కుమారి, లక్ష్మి, సన్యాసమ్మ, సైదాబీ, రొంగలి ఈశ్వర్‌రావు, పంచాయతీ కార్మికులు జి.అప్పారావు, జి.లక్ష్మి, పాల్గొన్నారు.

కంచరపాలెం : సమ్మె నేపథ్యంలో కంచరపాలెంలో ముఠా కళాసీల సమావేశం

కంచరపాలెంలో మాట్లాడుతున్న సుబ్బారావు

నిర్వహించారు. ఈ సందర్భంగా ముఠా కళాసీల సంఘం (సిఐటియు) జిల్లా కార్యదర్శి ఎం.సుబ్బారావు మాట్లాడుతూ, దేశంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మిక హక్కులు, చట్టాలను నిర్వీర్యం చేసిందని, లేబర్ కోడ్‌లు తీసుకొచ్చి కార్మికులను యజమానులకు కట్టు బానిసలుగా మార్చుతోందని విమర్శించారు. కార్యక్రమంలో సిఐటియు జోన్ సెక్రటరీ ఒ.అప్పారావు, నాయకులు ఎస్.శ్రావణ్‌కుమార్, నరసింహమూర్తి, ముత్యాలనాయుడు పాల్గొన్నారు.

ములగాడ : అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన హెచ్‌పిసిఎల్ లేబరు గేటు వద్ద సోమవారం ఉదయం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఐఎన్‌టియుసి జిల్లా కార్యదర్శి భోగవల్లి నాగభూషణం, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.లక్ష్మణమూర్తి, వైఎస్ఆర్‌టియుసి జిల్లా అధ్యక్షులు ఆర్.అనిల్‌కుమార్, ఎఐటియుసి జిల్లా నాయకులు కె.సత్యనారాయణ మాట్లాడారు. 20న దేశవ్యాప్త సమ్మెలో హెచ్‌పిసిఎల్ కాంటాక్ట్ కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలు నాయకులు కె.సెంటారావు, జి.నరేష్, ఎస్.తాతబాబు, ఎస్.వాసు, ఎస్.బాబు, వై.గంగాధర్, బి.శ్రీను, డి.రాజు, నీలయ్య, ప్రసాద్, గంట దాసు, బి.అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌పిసిఎల్ గేట్ వద్ద అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రచారం

బెజవాడకే 'అవిశ్వాసం' వర్తింపు

బెజవాడ నాగేశ్వరరావు

ప్రజాశక్తి - యలమంచిలి : యలమంచిలి మున్సిపాలిటీలో కొనసాగుతున్న పవర్ పాలిటిక్స్‌లో భాగంగా వైస్ చైర్మన్లు ఇద్దరు బెజవాడ నాగేశ్వరరావు, ఆరెపు గుప్తాలపై టిడిపి కూటమి నేతలు ప్రకటించిన 'అవిశ్వాస' నోటీసు కేవలం బెజవాడ నాగేశ్వరరావుకే వర్తిస్తుందని కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు. అవిశ్వాస విషయమై సోమవారం సాయంత్రం కమిషనర్ ప్రజాశక్తితో మాట్లాడుతూ అవిశ్వాసం ప్రకటించిన వారి సంతకాలు సరిచూసి కలెక్టర్‌కు నివేదిక పంపామన్నారు. ఈ నెల 14న కలెక్టర్ విధుల్లో చేరుతారని, ఆమె ఆదేశాలను అనుసరించి తదుపరి నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. అయితే ఈ నోటీసు ఇద్దరు వైస్ చైర్మన్లలో బెజవాడ నాగేశ్వరరావుకు మాత్రమే వర్తిస్తుందన్నారు. ఈ అవిశ్వాస నోటీసు నాలుగేళ్లు నిండిన వైస్ చైర్మన్-1 బెజవాడ నాగేశ్వరరావుకు మాత్రమే వర్తిస్తుందని చెప్పారు. 2022 ఏప్రిల్‌లో వైస్ చైర్మన్-2గా ఎన్నికైన ఆరెపు గుప్తాకు వర్తించదని, అందువల్ల ఆయన పదవి కొనసాగుతుందని చెప్పారు.

సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని చౌడపల్లి గ్రామంలో మండల పరిషత్ నిధులు రూ.7.50లక్షలతో డ్రైనేజీ, సిసి రోడ్ నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ గండిబోయిన భాను వెంకట సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కోన లచ్చన్న నాయుడు, వడిశల శ్రీనివాసరావు కర్రి అప్పారావు, కాకి సూకరాజు, ఇలా లోకనాథం, సింహాచలం, పాల్గొన్నారు.

టిడిపి మండల అధ్యక్షునికి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-సబ్బవరం : టిడిపి మండలం అధ్యక్షుడుగా నూతనంగా ఎన్నికైన గండి ముత్యాలనాయుడును ఆ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు మిడతాడ మహాలక్ష్మి నాయుడు అమృతపురంలోని ఆయన స్వగృహంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛమిచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

నరేష్‌కు ఉత్తర్వులు అందిస్తున్న దృశ్యం

టిడిపి వడ్డాది పట్టణ అధ్యక్షునిగా నరేష్

ప్రజాశక్తి-బుచ్చెయ్యపేట : మండలంలోని మేజర్ పంచాయతీ వడ్డాది టిడిపి టౌన్ అధ్యక్షునిగా దొండా నరేష్ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం స్థానిక కార్యకర్తల సమావేశంలో టిడిపి గ్రామ ఉపాధ్యక్షునిగా ముత్యాల సూరిబాబు, ప్రధాన కార్యదర్శిగా సయ్యపు రెడ్డి మాధవరావు, సోషల్ మీడియా ఇంచార్జ్‌గా తలారి శంకర్. వడ్డాది తెలుగు యువత అధ్యక్షులుగా దండి లక్ష్మణ్ కుమార్ ఎన్నికయ్యారు. వీరికి కోరుకొండ గురుమూర్తి వరహాలు, హైస్కూల్ చైర్మన్ మేడివాడ రమణ, అక్కిరెడ్డి కనక అభినందనలు తెలిపారు.

మహిళ హత్య కేసులో జీవిత ఖైదు

ప్రజాశక్తి-చోడవరం : మహిళను హత్య చేసిన కేసులో అల్లూరి సీతారామరాజు జిల్లా దుంబ్రిగూడ మండలం జోడిగూడ గ్రామానికి ముద్దాయి కిల్లో దయత్రి రఘునాథ్‌కు చోడవరం 9వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కె.రత్నకుమార్ జీవిత ఖైదీతో పాటు 13000 జరిమానా విధించారు. కేసులు వివరాలు ఇలా ఉన్నాయి... కిల్లో దయత్రి జీలుగు చెట్టును కిల్లో ముకుంద్‌కి అప్పగించి, ఆయన నుండి ప్రతిరోజూ డబ్బు తీసుకునేవాడు, కిల్లో దయత్రి, కిల్లో ముకుంద్ మధ్య వివాదాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో 2013 ఫిబ్రవరి 14న కిల్లో దయత్రి కిల్లో ముకుంద్ ఇంటికి వెళ్లి కిల్లో ముకుంద్‌తో గొడవ పడ్డాడు. అదే సమయంలో కిల్లో ముకుంద్ భార్య కిల్లో లక్ష్మి తన భర్తను కొట్టిన కిల్లో దయత్రిని ఆపడానికి ప్రయత్నించింది. ఈ క్రమంలో కిల్లో దయత్రి లక్ష్మి తలపై ఇనుప రాడ్‌తో కొట్టాడు. దీంతో కిల్లో లక్ష్మికి తీవ్ర గాయాలై 2013 ఫిబ్రవరి 20న విశాఖ కెజిహెచ్‌లో మృతి చెందింది. అప్పట్లో నిందితుడు కిల్లో దయత్రిపై అరకు పోలీసులు కేసును నమోదు చేసి, విచారణ చేపట్టారు. కోర్టులో సాక్షాలు బలంగా నిరూపించడంతో ముద్దాయి కిల్లో దయత్రి రఘునాథ్‌కు న్యాయమూర్తి శిక్ష ఖరారు చేశారు.

ప్రకృతి వ్యవసాయ లాభాలపై అవగాహన

ప్రజాశక్తి-బుచ్చెయ్యపేట : బుచ్చెయ్యపేట మండలం దిబ్బిడి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే లాభాలపై సోమవారం సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రకృతి సాగు చేసిన సుతపల్లి సర్వేశ్వరరావు, పెదిరెడ్ల అప్పారావులను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెదిరెడ్ల మాణిక్యం, మాజీ ఎంపీటీసీ గోన్నాబత్తుల శ్రీనివాసరావు, విఏఏ రమణమ్మ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సూరిబాబు యాకిరి, రామకృష్ణ, మాధవి, పవన్, లక్ష్మి, పూర్ణిమ, చిన్నారి, సత్య రైతులు పాల్గొన్నారు.

జర్నలిస్టు బొడ్డేడకు జ్ఞానీ జైల్ సింగ్ స్మారక పురస్కారం

బొడ్డేడ జగ్గ అప్పారావును సత్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా మునగపాక మండలం గవర్లఅనకాపల్లి గ్రామానికి చెందిన జర్నలిస్టు, సామాజికవేత్త బొడ్డేడ జగ్గఅప్పారావు (జగన్)కు మాజీ రాష్ట్రపతి "జ్ఞానీ జైల్ సింగ్ స్మారక పురస్కారం లభించింది. జ్ఞానీ జైల్ సింగ్ స్మారక పురస్కారాన్ని విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరల్డ్ ప్రెస్ ఫ్రీడమ్ డే, ఏపీజేయు 5 వసంతాల వార్షికోత్సవం పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల యూనియన్ (ఏపీజేయు), శ్రీగోసంరక్షణ సమితి, వినోద్ ఫౌండేషన్, ఆధరణ చారిటబుల్ ట్రస్ట్ వివిధ స్వచ్ఛంద సంస్థలు సంయుక్త నిర్వహణలో దేశంలో మొదటిసారిగా జాతీయస్థాయి పురస్కారాల బహూకరణ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. కాగా జగ్గఅప్పారావు పాత్రికేయునిగా గత 20 ఏళ్లుగా ఉంటూ, సమాజ సేవలో నిస్వార్థంగా అత్యుత్తమ సేవలందించారు. ఈ సందర్భంగా భారత మాజీ రాష్ట్రపతి జ్ఞానీ జైల్ సింగ్ అవార్డుకు కమిటీ ఎంపిక చేసింది. జ్ఞాపిక, మెడల్, జ్ఞానీ జైల్ సింగ్ అవార్డు అభినందన పత్రం అందించారు. ఈ అవార్డు రావడం పట్ల పలువురు పాత్రికేయులు, అభినందించారు.

సమగ్ర శిక్షలో పని చేయడానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి సమగ్ర శిక్ష కార్యాలయంలో సెక్టోరల్, అసిస్టెంట్ సెక్టోరల్ పోస్టులలో ఫారిన్ సర్వీస్‌లో డిప్యుటేషన్‌పై పనిచేయుటకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు అదనపు పథక సమన్వయకర్త ఆర్. జయప్రకాష్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. సమగ్ర శిక్ష కార్యాలయంలో అయిదు సెక్టోరల్, అసిస్టెంట్ సెక్టోరల్ పోస్టులలో (కమ్యూనిటీ మొబలైజింగ్ ఆఫీసరు, అకడమిక్ మోనటరింగు అధికారి, బాలికల అభివృద్ధి అధికారి, అసిస్టెంటు ప్రోగ్రాం అధికారి, అసిస్టెంటు జిసిడిఒ) ఫారిన్ సర్వీస్‌లో, డిప్యుటేషన్‌పై పనిచేయుటకు 55 సంవత్సరములు దాటని ఆసక్తిగల అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 12 నుండి 19వ సాయంత్రం 5 గంటల వరకు కార్యాలయములో దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని చెప్పారు. పూర్తి వివరములు, దరఖాస్తు నమూన apssakp.com వెబ్‌సైట్‌లోనూ, సమగ్ర శిక్ష కార్యాలయం, అనకాపల్లిలో సంప్రదించాలని కోరారు.

పాడి రైతులకు బీమా సొమ్ము పంపిణీ

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని తాళ్లపాలెం విశాఖ డెయిరీ పాల ఉత్పత్తిదారుల సంఘం పరిధిలో గ్రూపు ఇన్సూరెన్స్ పథకంలో ఉండి మరణించిన పాడి రైతులు కర్రి గోవింద, తోరం చిన్నాయుడు కుటుంబ సభ్యుల నామినీలకు ఒక్కో కుటుంబానికి లక్ష రూపాయల చొప్పున రూ.2 లక్షలు సోమవారం అందజేశారు. అలాగే సొసైటీలో 2024-25 సంవత్సరంలో సుభీభవ కార్డులు కలిగిన 145 మంది పాడి రైతులకు విశాఖ డెయిరీ ద్వారా దాణా గిన్నెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల సంఘం అధ్యక్షులు గుమ్మిడి నారాయణరావు, ఏరియా సూపర్‌వైజర్ కాయల సత్యనారాయణ, వేతన కార్యదర్శి విరోతుల శ్రీను, పాలక వర్గ సభ్యులు, పాడి రైతులు పాల్గొన్నారు.

బీమా సొమ్ము అందిస్తున్న దృశ్యం

వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని బోయిల కింతాడ గ్రామంలో అనిల్ నీరుకొండ ఆసుపత్రి (తగరపువలస) సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బూరె బాబురావు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. 116 మందికి రోగులను పరీక్షించారు. 26 మందిని శస్త్ర చికిత్సలకు ఆసుపత్రికు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో రాపేటి రామ కొండారావు, అన్నం రామునాయుడు, బొబ్బిలి రాము, క్రోమార బాబురావు, అన్నం సాంబమూర్తి వైద్య నిపుణులు శ్రావ్య, తేజ్ నారాయణ, కీర్తి, అనూషా, వర్ష, వైద్య శిబిరం సమన్వయ కర్త ఈశ్వరి, సచివాలయం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

ప్రజాశక్తి-కె.కోటపాడు : 'అన్నదాత సుఖీభవ' పథకం లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా సాగుతోందని మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా రైతులకు ఏడాదికి సాగు ఖర్చులు నిమిత్తం రూ.20 వేలు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. ఇందులో పిఎం కిసాన్ కింద మూడు విడతల్లో కేంద్రం రూ.6వేలు ఇస్తుండగా, మిగిలిన రూ.14వేలు మూడు విడతల్లో రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వటానికి చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయపు పన్ను చెల్లింపుదారులు ఈ పథకానికి అనర్హులని పేర్కొన్నారు. ప్రతి రైతు భూమి పాసు పుస్తకం, ఆధార్, బ్యాంకు పుస్తకం, రైస్ కార్డు జెరాక్స్ పత్రాలను రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకులకు అందజేయాలని కోరారు. వెబ్ ల్యాండ్‌లో సర్వే నంబర్లు, రైతు పేరు, విస్తీర్ణం కచ్చితంగా ఉన్నది లేనిది విఏఏలు పరిశీలించి వ్యవసాయాధికారి లాగిన్‌కు పంపుతారని, అక్కడనుండి జిల్లా వ్యవసాయ అధికారి లాగిన్‌కు వెళుతుందని పేర్కొన్నారు. వెబ్ ల్యాండ్‌లో ఏమైనా తప్పులుంటే సరి చేస్తారని, లేని పక్షంలో తహసీల్దార్ దృష్టికి తీసుకు వెళ్లి సరి చేయించుకోవాలని సూచించారు. ఈ నెల 20వ తేదీ లోపు అర్హత గల రైతులందరూ నమోదు చేసుకోవాలని కోరారు.

వనరులపై రంగుల చిత్రాలతో అవగాహన

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఎచ్చర్ల కింజరాపు ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామంలో ప్రభుత్వ రంగ సంస్థలు, వనరులు అన్న అంశంపై రంగుల చిత్రాలతో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఏయే సంస్థలు పనిచేస్తున్నాయి, వాటి వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విద్యార్థులు ప్రసన్న హేమలత, మమతా, ప్రశాంతి, హారిక ప్రియా తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

టిడిపి గ్రామ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని వెన్నెలపాలెం గ్రామంలో మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో సోమవారం తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడుగా బోజంకి అప్పలనాయుడు, ప్రధాన కార్యదర్శి బండారు వీరు నాయుడు, ఉపాధ్యక్షులుగా వెన్నెల గిరి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా వెన్నెల అప్పారావు, కొండ్రపు అప్పారావు, మఠం అచ్చిబాబు, కార్యదర్శులుగా రొంగలి సత్తిబాబు, పెదపాటి మహేష్, జంగాల త్రినాథ్, కోశాధికారులుగా గోపి కనకరాజు, పైలా సన్యాసిరావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పైల రతాల సన్యాసిరావు, గొంప మారు నాయుడు, పైల వరలక్ష్మి , పైల సన్యాసిరావు (చిన్న), పైల కనకరాజు, భోజంకి గోపి, పైల అప్పారావు, పైల సత్యవతి, పాల్గొన్నారు.

ఎన్నికైన కమిటీతో ఎమ్మెల్యే బండారు

పిజిఆర్ఎస్ అర్జీలపై తక్షణ చర్యలు

అర్జీలు స్వీకరిస్తున్న జెసి జాహ్నవి

వికలాంగురాలి సమస్య వింటున్న ఎస్‌పి

ప్రజాశక్తి- అనకాపల్లి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్.) కార్యక్రమంలో వచ్చే అర్జీలను వెంటనే పరిష్కరించాలని, అర్జీలపై సకాలంలో చర్యలు తీసుకోవాలని ఇంచార్జి జిల్లా కలెక్టరు, జెసి ఎమ్.జాహ్నవి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జేసీతో పాటు డిఆర్ఒ వై.సత్యనారాయణరావు, హౌసింగు పిడి వై.శ్రీనివాసరావు, ఎస్‌డిసి ఎస్‌విఎస్.సుబ్బలక్ష్మి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వారి పరిష్కారానికి సంబంధిత జిల్లా అధికారులకు ఆదేశాలు జారీచేశారు. పెండింగు అర్జీలపై సమీక్ష నిర్వహించి వాటిని వెంటనే పరిష్కరించాలని కోరారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో...

జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మొత్తం 20 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో ఆస్తి తగాదాలు, కుటుంబ వివాదాలు, చీటింగ్ తదితర అంశాలు ఉన్నాయి. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా స్వయంగా ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి, వారితో ప్రత్యక్షంగా మాట్లాడారు. వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు, ఎస్సై వెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

సబ్బవరం : మండలంలోని అసకపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్1లో ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్‌కు అసకపల్లి గ్రామస్తుడు కర్రి కనకరాజు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసకపల్లి సర్వే నెంబర్ 1లో ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది కబ్జా చేసి అక్రమంగా నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. అసకపల్లి సర్వే నెంబర్ 1లో అక్రమంగా క్వారీలు తవ్వి గ్రావెల్‌ను తరలిస్తున్నారని ఆరోపించారు. దీనిపై తక్షణమే రెవిన్యూ, మైనింగ్ అధికారులు దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

గోవాడ సుగర్స్ రైతులకు న్యాయం చేయాలి

బుచ్చయ్యపేట : గోవాడ సుగర్ ఫ్యాక్టరీ సభ్య రైతులకు న్యాయం చేయాలని కోరుతూ అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు మండలంలోని కేపీ అగ్రహారం సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు సోమవారం స్థానిక విలేకరులకు తెలిపారు. గడిచిన సీజన్లో ఫ్యాక్టరీ తరచూ మరమ్మతులకు గురికావడం, చెరుకు రవాణా నిలిచిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల చెరుకు రవాణా నిలిచిపోవడంతో చెరకు ఎండిపోయిందని, ఫ్యాక్టరీలో సైతం సరైన మెయింటినెన్స్ లేక తరచు మరమ్మతుల గురవుతుందని చెప్పారు. చెరుకు సరఫరా చేసిన రైతులకు, చెరుకు రవాణా చేసిన ట్రాక్టర్ల రవాణా చార్జీలను పూర్తిస్థాయిలో బకాయిలు చెల్లించలేదని పేర్కొన్నారు. చెరుకు రైతును ఆదుకోవాలని కోరుతూ వినతి పత్రం సమర్పించినట్లు ఆయన తెలిపారు.

బార్క్ జాబితాలో తొలగించిన పేర్లు చేర్చండి

అచ్యుతాపురం : బార్క్ భూసేకరణ సమయంలో తంతడి పంచాయితీ యాతపాలెం గ్రామ నిర్వాసితులు నమోదు చేసిన జాబితా నుంచి తొలగించిన పేర్లు తిరిగి చేర్చాలని గ్రామస్తులు సర్పంచ్ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. 2005లో బార్కుకు భూసేకరణ చేపట్టారు. భూ సేకరణ సమయంలో యాతపాలెం గ్రామ నిర్వాసితుల పేర్లు నమోదు చేసి స్ట్రక్చర్ పేమెంట్ నష్టపరిహారంగా చెల్లించారుం. అధికారులు చేసిన రెండు సర్వేలలో తమ పేర్లు ఉన్నాయని, ఈనెల 8న ఆర్డీవో సమక్షంలో పెట్టిన జాబితాలో 40 మంది నిర్వాసితుల పేర్లు కనిపించడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ జాబితాపై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ చౌడిపల్లి మురళి తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న దృశ్యం

నిరసన తెలుపుతున్న కేబుల్ ఆపరేటర్లు

కలెక్టరేట్ వద్ద కేబుల్ ఆపరేటర్ల నిరసన

అనకాపల్లి : ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్ పథకంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెంటనే రివ్యూ మీటింగ్ నిర్వహించాలని వివిధ కేబుల్ ఆపరేటర్ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ), ఫైబర్ నెట్ ఆపరేటర్స్ ఫెడరేషన్ (ఎఫ్ఓఎఫ్), మల్టీ సర్వీసెస్ సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు మిరియాల శ్రీరామ్, మల్టీ సర్వీసెస్ జిల్లా అధ్యక్షుడు కొణతాల ప్రకాష్ (కెవిఎస్), ఎఫ్ఓఎఫ్ జిల్లా అధ్యక్షుడు నడింపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు ప్రత్యక్షంగా లబ్ధి చేకూరుస్తున్న ఫైబర్ నెట్ పథకం రానురాను దిగజారి పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫైబర్‌నెట్ వల్ల నెట్, కేబుల్ టీవీ, ల్యాండ్ ఫోను మూడు సౌకర్యాలు నాణ్యతతో కూడిన సేవలు తక్కువ ధరలకు ప్రజలకు అందుబాటులో ఉన్నాయన్నారు. ఉన్నఫలంగా వందలాది సిబ్బందిని తొలగించడంతో సేవలకు అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాన్ని నమ్ముకుని స్వయం ఉపాధితో లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టిన ఆపరేటర్లను ఆదుకోవాలని కోరారు. అనంతరం పబ్లిక్ గ్రీవెన్స్‌లో జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పొలమరశెట్టి ఈశ్వరరావు (నక్కలపుట్టు), దాడి ఈశ్వరరావు, దాడి శివ, శ్రీనివాసరావు, తానాం అప్పారావు, అనపర్తి ఈశ్వరరావు, సీతారాం, గోవిందు, వరహాల బాబు, భారీ ఎత్తున సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై పనిభారం తగదు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : గ్రామాలలో సామాజిక పెన్షన్లు పంపిణీ బాధ్యత నుంచి అంగన్వాడీ కార్యకర్తలను మినహాయించాలని అంగన్వాడీ యూనియన్ నాయకులు నారాయణమ్మ, అంబికా డిమాండ్ చేశారు. ఈ మేరకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఆదివారం ఎంపీడీవో ప్రభాకర్‌రావుకు అందజేశారు. దీనికి ముందు జరిగి కార్యకర్తలు సమావేశంలో యూనియన్ నాయకులు నారాయణమ్మ, అంబిక మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్లకు ప్రభుత్వం రకరకాలు ఆన్లైన్ యాప్స్ వంటి పనులు అప్పగించడం వల్ల పని భారం పెరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సచివాలయ సిబ్బందికి రెండు మూడు నెలలు పింఛన్లు పంపిణీ సమయంలో సహకరించాలని అధికారులు కోరిన మీదట సహకరించడం జరుగుతుందని తెలిపారు. పింఛన్లు పంపిణీ సహాయం నుంచి ఇప్పుడు పూర్తి బాధ్యతలు అప్పగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తమపై అదనపు భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెన్షన్ డ్యూటీ నుంచి అంగన్వాడీ వర్కర్లను మినహాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

తహశీల్దారుగా సత్య నారాయణ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మండల తహశీల్దారుగా జి.సత్యనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన తహశీల్దారు బదిలీ కావడంతో ఆ స్థానంలో తహశీల్దారుగా సత్యనారాయణ చేశారు. సత్యనారాయణకు రెవిన్యూ సిబ్బంది, స్థానికులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు

ఒరిగిన విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి-యలమంచిలి : రామనగర్ ప్రాంతంలో ఇటీవల నూతనంగా పంపిణీ చేసిన టిడ్కో ఇళ్లకు వెళ్లే మార్గంలో ఉన్న విద్యుత్ స్తంభం ఒరిగిపోయింది. దీంతో ఆ మార్గంలో ప్రయాణించే వారు భయాందోళన చెందుతున్నారు. హుదూద్ తుపాన్ సమయంలో నేటమట్టమైన విద్యుత్ లైన్‌లను అప్పట్లో హడావిడిగా పునరుద్ధరించారు. ఈ స్తంభాలకు సఫోర్టు స్తంభాలు లేకపోవడంతో ఈదురు గాలులకు కొన్ని ఒరిగి పోతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒరిగిపోయిన స్తంభాలకు బలం చేకూర్చే విధంగా సపోర్టు స్తంభాలు వేస్తామని విద్యుత్ సిబ్బంది చెబుతున్నా ఆచరణలో కాలయాపన చేస్తున్నారు. ఇటీవల వీచిన ఈదురు గాలులకు ఈ మార్గంలో స్తంభం ఒరిగింది. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఒరిగిన స్తంభాలను పటిష్టం చేయాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

ఒరిగిన విద్యుత్ స్తంభం

పూజలు చూస్తున్న ఎమ్మెల్యే రాజు తదితరులు

వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు

ప్రజాశక్తి -చోడవరం : చోడవరం వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు, మాజీ టిడిపి జిల్లా పార్టీ అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెలు సత్యనారాయణ తదితరులు ప్రత్యేక పూజల్లో చేశారు.. ఆలయపూజారులు పూర్ణకుంభం తో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్ధ ప్రసాదం అందజేశారు.

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి-సబ్బవరం : సబ్బవరం మండలం గుల్లేపల్లి గ్రామానికి చెందిన దేవర దుర్గాదేవికి సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.1,31,354 చెక్కును సబ్బవరం మండల జనసేన పార్టీ అధ్యక్షులు కర్రి కనకరాజు, కూటమి నాయకులు రోమాల చంద్రశేఖర్ సమక్షంలో సోమవారం సుజాతనగర్‌లోని పెందుర్తి నియోజకవర్గం జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో గుల్లేపల్లి మాజీ సర్పంచ్ గజ్జి నరసింగరావు, నంబూరు రాజబాబు, నెక్కెళ్ళ కెవిన్, బోకం నారాయణమూర్తి, గొంప అశోక్, పల్లా సత్తిబాబు, గొంప ఆనంద్, గంప ఈశ్వరరావు, కాకర ఈశ్వరరావు, కాకర సర్వారావు, దేవర శరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ పంపిణీ బాధ్యతల నుంచి..

అంగన్వాడీలకు మినహాయింపు ఇవ్వాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:తమకు పని భారం పెరిగిందని, పింఛన్ పంపిణీ డ్యూటీ నుండి అంగన్వాడి వర్కర్స్ కు మినహాయింపు నివ్వాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దుర్గారాణి, యూనియన్ నాయకులు కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సీతారామరాజును కలిసి సమస్యను విన్నవించి, వినతిపత్రం అందజేశారు.

ప్రభుత్వం వచ్చిన కొత్త లో గ్రామాల్లో లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీలో సచివాలయం సిబ్బందికి 2,3 నెలలు సహకరించాలని కోరడంతో రకరకాలు యాప్స్‌తో పనిభారం ఉన్నప్పటికీ అంగీకరించామన్నారు. పెన్షన్ పంపిణీ చేసిన సమయంలో అమౌంట్ కూడా అంగన్వాడి కార్యకర్తలకు ఇచ్చి కొన్ని చోట్ల పెన్షన్ పంపిణీ చేయమంటున్నారని, ఇప్పటికే యాప్‌లతో పని ఒత్తిడి పెరిగి ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 1వ తేదీ నుంచి పిల్లల బరువు తీయడం, టి హెచ్ ఆర్ పంపిణీ చేయడం, పిల్లలకు పోషకాహారం వండి పెట్టడం, ప్రీ స్కూల్ నిర్వహించటం, యాప్ లలో అప్లోడ్ చేయడం ఇలా అనేక పనులతో సతమతమవుతున్న పరిస్థితిలోను, ఒత్తిడిలోనూ ఉంటున్న తమతో పింఛన్ నగదు పంపిణీ చేయమంటున్నారని, ఏ చిన్న పొరపాటు జరిగినా తమ ఉద్యోగాలకు ముప్పు ఏర్పడే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వెలిబుచ్చారు. గుంటూరులో ఇటీవల రాజకీయ జోక్యం కారణంగా ఒక వర్కర్ ను ఉద్యోగ్యం విధుల నుండి తొలగించడం జరిగిందన్నారు. తమతో పింఛన్ పంపిణీ చేపట్టడంతో అంగన్వాడి సెంటర్ల విధుల నిర్వహణకు ఆటంకం ఏర్పడుతుందని, తమ పరిస్థితిని అర్థం చేసుకుని పింఛన్ పంపిణీ డ్యూటీ నుండి మినహాయింపు నివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపిడిఒకు వినతిపత్రాన్ని ఇస్తున్న అంగన్‌వాడీలు

ఘనంగా బుద్ధ జయంతి వేడుకలు

కొత్తకోటలో నివాళి అర్పిస్తున్న సంఘం సభ్యులు

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం కొత్తకోట లో విశాఖ ఉమ్మడి జిల్లా దళిత సంక్షేమ సమాజం అంబేద్కర్ యువజన సేవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం బుద్ధ పౌర్ణమి వేడకలు ఘనంగా నిర్వహించా రు. స్థానిక పశు వైద్య శాల సమీపంలో గల బుద్ధ మందిరం స్థలంలో బుద్ధుడు చిత్ర పటానికి పూల మాలంకరణ చేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా దళిత సంక్షేమ సమాజం కన్వీనర్ మల్లేటి రాజు మాట్లాడుతూ, బుద్ధుని శాంతి మార్గంలో అందరూ నడవాలని కోరారు. పలువురు దాతల సాయంతో త్వరలో బుద్ధుని మందిరం నిర్మాణానికి అంకూర్పణ చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం సభ్యులు గెడ్డం కళ్యాణం, మంజేటి రమణ, ఎద్దు కళ్యాణం, పి సంహాచలం తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : స్థానిక సిద్దార్ధ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్, అసోసియేషన్ అధ్యక్షులు, బౌద్ధ సంఘాల సమాఖ్య ప్రతినిధి బల్లా నాగభూషణం ఆధ్వర్యాన స్థానిక నెహ్రూ చౌక్ జంక్షన్లో ఉన్న బుద్ధుని విగ్రహం వద్ద సోమవారం బుద్ధుని జయంతి వేడుకలు నిర్వహించారు. విగ్రహానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు, ప్రార్ధనలు చేశారు. కార్యక్రమంలో బొడ్డేడ అప్పారావు, వినకోట నీలేష్ గుప్తా, పట్నాల కృష్ణమోహన్, రొబ్బి మల్లేశ్వరరావు, సాహితీ వేత్త చక్రపాణి పాల్గొన్నారు.

దేవరాపల్లి : స్థానిక రైవాడ అతిథి గృహం వద్ద అంబేద్కర్ ఆశయ సాధన సంఘం ఆధ్వర్యంలో గౌతమ బుద్ధుడు జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షులు కాటపల్లి అప్పారావు, రైవాడ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పోతల పాత్రునాయుడు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, రైవాడ జలాశయం డిఈ ఆర్.సత్యం నాయుడు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

సీతమ్మధార : ప్రపంచవ్యాప్తంగా నెలకొని ఉన్న అశాంతి, అసమానతల నిరోధానికి బౌద్ధమే ఏకైక మార్గమని భారతీయ బౌద్ధ మహాసభ (బిఎస్ఐ) రాష్ట్ర అధ్యక్షుడు బేతాళ సుదర్శనం పేర్కొన్నారు. నగరంలోని పౌర గ్రంథాలయంలో గౌతమ బుద్ధుని జయంతిని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్, రాహుల్ సాంకృత్యాయన్, సామ్రాట్ అశోకుని చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు బౌద్ధ ధర్మాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా బౌద్ధం– ఆధునికత– విశిష్టత అంశంపై సుదర్శనం మాట్లాడుతూ, సాంఘిక అసమానతలు, సమస్యలకు, అశాంతికి పరిష్కార మార్గాన్ని అన్వేషిస్తూ బుద్ధుడు వేల సంవత్సరాల కిందటే మార్గాన్ని కనుక్కున్నారని తెలిపారు. ఎన్ఎస్‌టిఎల్ టెక్నికల్ ఆఫీసర్ ఎన్.రేణుకుమార్ ప్రజా కాంక్ష ప్రత్యేక సంచికను పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఐ జిల్లా అధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు, బౌద్ధ రచయిత డాక్టర్ బండి సత్యనారాయణ, బిఎస్ఐ రాష్ట్ర కార్యదర్శి పివి.సుబ్బారావు, ఎం.మల్లయ్యరాజు పాల్గొన్నారు.

దాణాను పంపిణీ చేస్తున్న సహాయ సంచాలకులు

50 శాతం సబ్సిడీతో పశువుల దాణా

ప్రజాశక్తి- కోటవురట్ల: వేసవిలో పశుగ్రాస సమస్య నివారణకు ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో సమీకృత దాణాలు అందజేస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ నరేష్ అన్నారు. ఈ మేరకు సోమవారం పాడి రైతులకు మండల టిడిపి అధ్యక్షులు జానకి శ్రీను చేతుల మీదుగా అందజేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1100 రూపాయల విలువగల దాణాను 550 రూపాయలకు అందజేస్తున్నామని తెలిపారు. 90 రోజులకు సరిపడా 150 కిలోల దానాను రైతులకు గరిష్టంగా మూడు పశువులకు సరిపడా దాణాను అందజేస్తామని తెలిపారు, ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు సూర్యారావు, మండల తెలుగు యువత అధ్యక్షులు తిరుమల రావు, టిడిపి నాయకులు జానకి హరిబాబు, సుంకర బాబ్జి పలువురు పాటి రైతులు పాల్గొన్నారు.

నియామకపత్రాన్ని ఇస్తున్న స్పీకర్ అయ్యన్న

ఫీల్డ్ అసిస్టెంట్లకు నియామక పత్రాలు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:మాకవరపాలెం మండలంలోని పిపి అగ్రహారం, కే.తూటిపాల, అప్పన్నదొరపాలెం, గిడుతూరులో నూతనంగా నియమితులైన ఎన్ఆర్‌జిఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లకు నియామక పత్రాలను స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సోమవారం నర్సీపట్నం స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ, పంచాయతీలలో వ్యవసాయ ఆధారిత పనులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. నియమితులైన ఫీల్డ్ అసిస్టెంట్లు నిబద్ధతతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఛాయసుధ, ఈఓపిఆర్‌డీ సీతామహాలక్ష్మి, ఏపీఓ కాశీ, మాకవరపాలెం మండల టిడిపి అధ్యక్షులు ఆర్‌వై పాత్రుడు, శెట్టి పాలెం సర్పంచ్ అల్లు నాయుడు, మాజీ సర్పంచ్ ఎస్‌విఎన్ చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుడుతున్న డిఎస్‌పి

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: మండలంలోని చెట్టుపల్లి గ్రామంలో నర్సీపట్నం డిఎస్పి శ్రీనివాసరావు ఆధ్వర్యాన మైత్రి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ, రోడ్ యాక్సిడెంట్లు జరగకుండా ఉండాలంటే ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, ఓవర్ లోడింగ్ వంటివి ప్రమాదాలకు దారితీస్తాయని వివరించారు. రోడ్ యాక్సిడెంట్లతో కుటుంబాలు ఎదుర్కొనే నష్టాలను తెలిపారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలన్నారు.ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

తారు రోడ్డు నిర్మించరూ..

ప్రజాశక్తి-అనంతగిరి:మండలంలోని కాశీపట్నం పంచాయతీ సీతంపేట గ్రామనికి రోడ్డు సౌకర్యం లేక నానా అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో గ్రామస్తుడు సిఎస్ .సూర్యనారాయణ మాట్లాడుతూ, తమ గ్రామంలో 20 కుటుంబాలు పూర్వకాలం నుండి నివసిస్తున్నామన్నారు. గుమ్మకోట మెయిన్ రోడ్డు నుండి తమ గ్రామం వరకు సుమారు మూడు కిలోమీటర్ల దూరం ఉంటుందని, వర్షాకాలంలో మట్టి రోడ్డు గోతులు మయంగా మారుతుందన్నారు. దీంతో వాహనాలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బంది పడుతునామన్నారు.

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: మున్సిపాలిటీ 1వ వార్డులో టిడిపి సీనియర్ నాయకుడు, కీర్తిశేషులు లాలం సూరిబాబు వర్ధంతిని పురస్కరించుకొని 1వ, 2వ వార్డుల తెలుగుదేశం పార్టీ వార్డ్ ఇంచార్జ్, తెలుగు యువత అధ్యక్షుడి లాలం మురళీకష్ణ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సుమారు 80 మంది యువకులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి గౌరవ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు గారి చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా గౌరవ స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, పుట్టినరోజులు, మరియు ఇతర కార్యక్రమాలకు అనవసర ఖర్చులు చేయకుండా, ఇటువంటి సమాజపరమైన సేవా కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ఒక ప్రాణాన్ని కాపాడే అవకాశముంటుంది. ఇది ప్రతి ఒక్కరికి ఉన్న బాధ్యత" అని తెలిపారు. లాలం మురళీకష్ణ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించిందని, ఒకే వార్డులో 80 మంది యువకులు పాల్గొనడం అభినందనీయమని స్పీకర్ కొనియాడారు.

కొనసాగిన వేసవి విజ్ఞాన శిబిరాలు

గ్రంథాలయంపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థి శ్రీవిద్య

ప్రజాశక్తి -నక్కపల్లి:గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ప్రతి ఒక్కరూ వినియోగించుకుని విజ్ఞానవంతులు అవ్వాలని గ్రంథాలయ అధికారి జనార్ధన్ సూచించారు. మండలంలోని చినదొడ్డుగల్లు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా సోమవారం గ్రంథాలయాల పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రంథాలయంలో అనేక రకాల పుస్తకాలు, వార్తాపత్రికలు అందుబాటులో ఉంటాయని, విద్యార్థులు ప్రతిరోజు గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం అలవర్చుకోవాలన్నారు. సభ్యత్వం తీసుకుంటే పుస్తకాలను ఇంటికి తీసుకువెళ్లి చదువుకోవచ్చునని తెలియజేశారు. విద్యార్థి వెలగా శ్రీవిద్య గ్రంథాలయం గురించి చార్టు రూపంలో రూపొందించి, ఎంతో చక్కగా విపులంగా వివరించింది.

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం సందర్భంగా సోమవారం చెస్ గేమ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమం గ్రంథాలయ అధికారి కె.జగన్ విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

ములగాడ : మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో బాలల వేసవి శిక్షణ శిబిరం సోమవారమూ కొనసాగింది. బుద్ధ పూర్ణిమ సందర్భంగా బుద్ధునిపై విద్యార్థులకు క్విజ్ నిర్వహించారు. విజేతలకు గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, బుద్ధని అష్టాంగమార్గాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కె.పాపారావు, బాలలు పాల్గొన్నారు.

తహశీల్దార్‌తో మాట్లాడుతున్న వెంకటేష్

నిర్వాసితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితులకు అన్ని విధాలుగా న్యాయం చేయాలని తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ కోరారు. భూసేకరణ ప్రభావిత గ్రామాలకు చెందిన నాయకులు, పలువురు రైతులతో కలిసి సోమవారం తహసిల్దార్ నరసింహమూర్తి దృష్టికి నిర్వాసితుల సమస్యలను తీసుకువెళ్లారు. పరిశ్రమ స్థాపన కోసం ఇల్లులు కోల్పోయిన బాధిత కుటుంబాలకు 2013 భూ సేకరణ చట్ట ప్రకారం పరిహారం, ఆర్ అండ్ ఆర్ చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, బుచ్చిరాజుపేట సర్పంచ్ కాళ్ళ శ్రీనివాస్, నాయకులు పుణ్యమంతుల బాబ్జి, సూరిబాబు, గరికిన సింహాద్రి, రాజు, కిలాడ శ్రీను, గోవిందు, గంగరాజు, సత్తయ్య తాతాజి, తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న పంచాయతీ కార్మికులు

పంచాయతీ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: నర్సీపట్నం మండలం వేములపూడి పంచాయితీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని సిఐటియు నాయకులు ఈరెల్లి చిరంజీవి డిమాండ్ చేశారు. స్థానిక ఆర్డిఓ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. నర్సీపట్నం ప్రజా సమస్యల పరిష్కారం వేదికలో ఈ సమస్యలపై ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. పారిశుధ్య కార్మికులకు సుమారు 18 నెలల వేతనం పెండింగ్లో ఉందన్నారు. కనీస వేతనాలు అమలు చేయాలని, సబ్బులు, కొబ్బరి నూనె, గుర్తింపు కార్డులు ఇవ్వాలని సిఐటియు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళామని తెలిపారు. పరిష్కారం చేసి తక్షణమే 18 నెలల వేతనం చెల్లించాలని వినతి పత్రం ఇచ్చామన్నారు.

కూలీలతో మాట్లాడుతున్న ఎంపిడిఒ

ఉపాధి హామీ కూలి పెంచాలి

ప్రజాశక్తి -రావికమతం: ఉపాధి హామీ రోజు వారి వేతన కూలి 307 రూపాయలు చెల్లించాలంటూ ఎంపిడిఓ కార్యాలయం వద్ద సోమవారం ఉపాధి కూలీలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మండలంలో చీమలపాడు పంచాయతీ ఉపాధి హామీ కూలీలు తట్టా, బుట్టలతో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు కూలీలు మాట్లాడుతూ, తమకు 100, 150 రూపాయలు మాత్రమే రోజువారి కూలి వస్తుందని, ప్రభుత్వం నిర్దేశించిన 307 రూపాయలు వేతన కూలీని చెల్లించలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

దీనికి స్పందించిన ఎంపీడీవో వెంకన్నబాబు, ఏపీవో చిన్నారావు దీనిపై తక్షణమే విచారణ చేపట్టి పనికి తగ్గ వేతనం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారు చెప్పారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ క్యూబిక్ మీటర్ రేటు ప్రకారం రోజువారి వేతన కూలి 307 రూపాయలు వచ్చే విధంగా కొలతల ప్రకారం పని ప్రదేశంలో పని ఉన్నట్టయితే తప్పనిసరిగా ఉపాధి శ్రామికులకు ఆ సొమ్మును ఇప్పించడం జరుగుతుందని తెలిపారు. పని ప్రదేశంలో 307 రూపాయలు పని ఉండగా 150 రూపాయలు ఇచ్చినట్లయితే సిబ్బందిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీల సమస్యలపై వినతి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: ఉపాధి హామీ కూలీల హక్కులను కాలరాయొద్దని సిపిఐ నేతలు డిమాండ్ చేశారు. స్థానిక రీజినల్ రెవెన్యూ కార్యాలయంలో ఆర్డీవోకు వినతిపత్రానందించారు. ఈ సందర్భంగా సిపిఐ అనకాపల్లి జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రాము నాయుడు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వెలుగుల అర్జున్‌రావు మాట్లాడుతూ, ఉపాధి హామీలో చేసిన పనికి డబ్బులు చెల్లించడంలో చాలా జాప్యం జరుగుతుందన్నారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు రావలసిన డబ్బుల్లో కేవలం నాలుగు వారాల డబ్బులు మాత్రమే ఇవ్వడం జరిగిందన్నారు. డబ్బులు రాకపోవడంతో ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నర్సీపట్నం కార్యదర్శి గొల్లు గురుబాబు, వ్య.కా.స గౌరవ అధ్యక్షుడు ఎస్.కొండలరావు, నల్లబెల్లి శ్రీరామ్మూర్తి, చోడే శ్రీనివాసరావు, మాకిరెడ్డి రాజబాబు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని..

ఆశా వర్కర్ల ఆందోళన

అనకాపల్లిలో ఆందోళన చేపడుతున్న ఆశావర్కర్లు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎన్టీఆర్ ఆస్పత్రికి గర్భిణిని డెలివరీకి తీసుకువచ్చిన కసింకోట మండలం మూలపేట ఆశా కార్యకర్త సిహెచ్ మాధవిపై రాత్రి ఆసుపత్రిలో "మేటి అసిస్టెంట్" సరళ మిశ్రా అకారణంగా దాడి చేయడానికి నిరసనగా సోమవారం ఎన్టీఆర్ వైద్యాలయం దగ్గర ఆశాలు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఆశాలకు భద్రత కల్పించాలని, ఆశా కార్యకర్తపై కొట్టి దుర్భాషలాడిన సరళ మిశ్రాపై చర్య తీసుకోవాలని, ఆశాలకు ఎన్టీఆర్ ఆసుపత్రి వద్ద కనీస వసతులు కల్పించాలని పెద్ద పెట్టిన నినదించారు. ఈ సందర్భంగా ఏపి ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా నాయకులు ఎల్.శాంతి, ఇ.పార్వతి, కె.వరలక్ష్మి, బి రామలక్ష్మి మాట్లాడుతూ రేయింబవళ్లు పనిచేస్తున్న ఆశా కార్యకర్తలకు కనీసం గౌరవం లేదన్నారు. వైద్యాధికారులు ఆశాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆసుపత్రి సూపరిటెండెంట్ శ్రీనివాసరావు కలుగజేసుకొని జరిగిన విషయంపై విచారణ జరిపి ఆశాలపై చేయి చేసుకున్న సరళ మిశ్రాతో ఆశాలకు క్షమాపణ చెప్పించారు. భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆశలు ఆందోళన నిర్మించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు సూర్య కళ, లక్ష్మి, రమణమ్మ, పెద్ద ఎత్తున ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రావికమతంలో నినాదాలు చేస్తున్న ఆశావర్కర్లు

రావికమతం: ఆశా వర్కర్ పై చేయి చేసుకున్న ఎన్టీఆర్ ఆసుపత్రి "మేటి అసిస్టెంట్"ను తక్షణమే సస్పెండ్ చేయాలంటూ రాష్ట్ర ఆశా యూనియన్ ప్రధాన కార్యదర్శి వజ్రపు సత్యవతి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాత్రి, పగలు అన్న తేడా లేకుండా కష్టపడుతున్న తమను చిన్నచూపు చూస్తూ, తమపై చేయి చేసుకోవడం పట్ల జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలోనూ, అన్ని పీహెచ్సీల వద్ద ఆశాలు నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగిందని ఆమె తెలిపారు. మాతా శిశు మరణాలు తగ్గడానికి తాము చేస్తున్న సేవలే కారణమని ఆమె తెలిపారు. దీంతో ఆశాలకు గుర్తింపు కూడా వచ్చిందని, అటువంటి ఆశ వర్కర్లపై స్టాఫ్ నర్స్ చేయి చేసుకోవడం పట్ల ఆమె ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గర్భిణీ డెలివరీ అయ్యేంత వరకు అక్కడ సేవలు అందిస్తున్న ఆశాల పట్ల దురుసుగా ప్రవర్తించడం చాలా బాధాకరమన్నారు. తక్షణమే స్టాఫ్ నర్స్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నూక రత్నం, వై.లక్ష్మి, పలువురు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సందడిగా మోదకొండమ్మ ఉత్సవం

▶▶ ఆకట్టుకున్న విద్యుత్ వెలుగులు ▶▶ అలరించిన ప్రదర్శనలు ▶▶ నేడు అనుపోత్సవం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: మన్యం ప్రజల ఆరాధ్య దేవత మోదకొండమ్మ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రెండో రోజు సోమవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచి అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆలయంలోని అమ్మవారిని, శతకంపట్టు వద్ద కొలువైన ఉత్సవ విగ్రహాన్ని భక్తులు, పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఆలయ, ఉత్సవ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. చిన్నా, పెద్దలకు వినోదం అందించేందుకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద గ్రౌండులో జెయింట్ వీల్, డ్రాగన్ ట్రైన్, ప్లే జోన్‌లో పలు రకాల చిన్నపిల్లల ఆటల పరికరాలను, ప్రత్యేక కార్యక్రమాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేయడంతో సందడి వాతావరణం కనిపించింది. వివిధ రకాల ప్రదర్శనలు కొనసాగాయి.

మెరిసిపోతున్న పాడేరు..

ఉత్సవాల సందర్భంగా పాడేరు పట్టణమంతా విద్యుత్తు దీప కాంతులతో మెరిసిపోతోంది. పట్టణమంతా సర్వాంగ సుందరంగా విద్యుత్ అలంకరణ పనులు ఉన్నాయి. అంబేద్కర్ సెంటర్ నుంచి అరకు, విశాఖ, చింతపల్లి వెళ్లే మెయిన్ రోడ్డు పైన పలు రంగులతో కూడిన సీరియల్ సెట్‌లతో విద్యుత్ అలంకరణ చేశారు. పట్టణంలోని మెయిన్ రోడ్డులో ఆయా చోట్ల భారీ విద్యుత్ సెట్టింగ్‌ల కోసం కటౌట్‌లు పెట్టారు. పట్టణంలోని కూడళ్ళలో ఏర్పాటు చేసిన దేవత రూపాల లైటింగ్ సెట్లు ఆకర్షణీయంగా ఉన్నాయి. ఆలయానికి సంప్రదాయంగా ముస్తాబు చేయగా, శతకంపట్టు పందిరిని సుందరంగా తీర్చిదిద్దారు. పట్టణంలో రహదారులన్నీ విద్యుద్దీపాలంకరణలతో కళకళలాడుతున్నాయి.

భారీ బందోబస్తు ఏర్పాటు..

900 మంది పోలీసులతో పటిష్ట భద్రత కల్పిస్తున్నారు. డ్రోన్ లు, సీసీ కెమెరాలు, శక్తి బృందాలు, డాగ్ స్క్వాడ్ లతో నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు. ప్రముఖులు పలువురు రాజకీయ నాయకులు వస్తుండటంతో పోలీసులు జాతరలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా ఎస్ పి అమిత్ బర్దార్ ఆదేశాలతో భద్రత ఏర్పాట్లను కట్టుదిట్టం చేశారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో ముందస్తు చర్యల్లో భాగంగా పాడేరు శివారు ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల నేపథ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. భారీ వాహనాలను మూడు రోజులపాటు ఘాట్ రోడ్డులో, పాడేరు పట్టణంలోకి అనుమతించలేదు. వాహన రద్దీ నియంత్రించేందుకు ట్రాఫిక్‌ను వివిధ మార్గాల్లో మళ్ళించారు. భక్తులకు ఎటువంటి సౌకర్యం కలగకుండా ప్రభుత్వ అధికారులు, ఆలయ, ఉత్సవ కమిటీ సభ్యులు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ప్రధాన కూడళ్ల వద్ద తాత్కాలిక మరుగుదొడ్లు అందుబాటులో ఉంచారు. వివిధ స్వచ్ఛంద సంస్థల సభ్యులు, వివిధ సంఘాల నాయకుల భక్తులకు తాగునీరు, మజ్జిగను అందిస్తున్నారు.

శతకంపట్టు వద్ద క్యూలో ఉన్న భక్తులు

నేడు అనుపోత్సవం..

ఉత్సవాల్లో భాగంగా ముగింపు రోజైన ఈనెల 13న మంగళవారం నాడు అనుపోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం శతకంపట్టులో కొలువుతీరిన మోదకొండమ్మ భక్తుల పూజలు అందుకుంటున్నది. ఉదయం, సాయంత్రం వేళల్లో అక్కడ డప్పులు మోతలతో అమ్మవారికి సేవలు అందిస్తున్నారు. మోదకొండమ్మ ఆలయంలో కొలువుతీరిన ఉత్సవ విగ్రహాన్ని, అమ్మవారి పాదాలను ఉత్సవాల్లో తొలి రోజైన ఆదివారం ఉదయం భారీ ఊరేగింపుతో తీసుకెళ్లి శతకంపట్టులో కొలువుదీర్చారు. రెండు రోజులు (సోమ, మంగళవారాలు) శతకంపట్టు వద్దే ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడో రోజు మంగళవారం మధ్యాహ్నం అమ్మవారిని, పాదాలను తిరిగి ఆలయానికి చేరుస్తారు. ఈ సందర్భంగా నిర్వహించే అనుపోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుంది. తొలి రోజుకు మించి ఊరేగింపులో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొంటారు. రకరకాల నృత్యాలు, వేషాలు, డప్పులు వాయిద్యాలు సందడి వాతావరణంలో ఉత్సవ విగ్రహాన్ని, పాదాలను పట్టణ వీధుల్లో ఊరేగింపు జరుగుతుంది. అమ్మవారిని తిలకించేందుకు వేలాదిగా భక్తులు తరలివస్తారు. అమ్మవారిని, పాదాలను తిరిగి ఆలయానికి చేర్చడంతో ఉత్సవాలు ముగుస్తాయి. అనుపోత్సవం ముగిసిన తర్వాత నిర్వహించే బాణాసంచా కాల్పులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. మంగళవారం రాత్రంతా భక్తులను అలరించేందుకు పలుచోట్ల సినీ, టీవీ కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు, గిరిజనులతో జానపద కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. భక్తులు ఈ కార్యక్రమాలను తిలకించి బుధవారం ఉదయం స్వస్థాలకు తిరుగు ప్రయాణమవుతారు.

కళా ప్రదర్శనలను తిలకించేందుకు వచ్చిన సందర్శకులు